www.peoplesnews.in

# హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 168 శుక్రవారం, మార్చి 13, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




## యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే...

- అప్పుడే యుద్ధ విరమణకు అంగీకరిస్తాం
- ఇరాన్ విషయంలో దుందుడుకు
- చర్యలు అంగీకరించం
- ప్రపంచానికి తేల్చిచెప్పిన ఇరాన్ నాయకత్వం
- పరస్పరదాడులతో కొనసాగుతున్న ఉద్రిక్తతలు
- రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి
- మరిన్ని దాడులు చేస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు




## హార్ముజ్ జలసంధి మూసే ఉంచుతాం

- అమెరికాపై ప్రతీకార
- దాడులు ఆగవు
- పొరుగుదేశాలు అమెరికా
- స్థావరాలు మూసేయాలి
- ఇరాన్ కొత్తనేత మొజ్తబా
- ఖమేనీ తొలి ప్రకటన
- ప్రసారం చేసిన
- ఇరాన్ టెలివిజన్




## యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం

- హార్మూజ్ జలసంధి నుంచి
- భారత్‌కు చమురు నౌక
- క్షేమంగా ముంబై తీరం
- చేరుకున్నషెన్‌లాంగ్
- ఇరాన్ పరోక్ష మద్దతుతో
- తొలి నౌక రాక




### త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో

## పోలీస్ శాఖ పాత్ర కీలకం

- పోలీస్ శాఖలో దశలవారీగా
- ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగం
- రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కి రూరల్
- అగ్రి రీజియన్ పై దృష్టి
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ
- సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,మార్చి 12 :** 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు పోతున్న క్రమంలో ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మొదట హోంశాఖ తదుపరి మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుతో కలిసి పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కీలకం అన్నారు. ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వరాదని, ప్రతి కదలిక మీ కనుసన్నల్లో ఉండాలని సూచించారు. విధుల నిర్వహణ క్రమంలో హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని ఇందులో భాగంగా పోలీస్ మిగతా2లో...

## యాదాద్రీశుడిని దర్శించుకున్న గవర్నర్

- గవర్నర్ శుక్లా దంపతులకు ఘన స్వాగతం
- దర్శనం చేయించి, వేదాశీర్వచనం ఇచ్చిన పండితులు



**యాదాద్రి,మార్చి 12 :** యాదగిరిగుట్టలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని తెలంగాణ నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనం కోసం గురువారం ఉదయం యాదగిరిగుట్టకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు. మిగతా2లో...





## స్పీకర్ నిర్ణయమే ఫైనల్..

- బిఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు క్లోజ్
- స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం
- తదుపరి విచారణ అవసరం లేదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ,మార్చి 12 :** తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది. మిగతా2లో...

## తెలుగు రాష్ట్రాలకు ఎండల నుంచి రిలీఫ్..

- తెలంగాణ, ఏపీకి వర్ష సూచన




## హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి 12 :** నెట్‌ఫ్లిక్స్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుందని, తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. హైటెక్‌సిటీలోని నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మిగతా2లో...



## 14 నుంచి పదోతరగతి పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సకాలంలో సెంటర్లకు చేరుకోవాలని సూచన
- ఐదు నిముషాల ఆలస్యానికి అనుమతి



**హైదరాబాద్,మార్చి 12 :** పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అధికారులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు శనివారం ప్రారంభమై.. ఏప్రిల్ 16వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. అయితే పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించబోరు. అంటే ఉదయం 9:35 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్షకు అనుమతించబోరు. విద్యార్థులు మిగతా2లో...

## 16 నుంచి ఒంటిపూట బడులు

- ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ




**హైదరాబాద్,మార్చి 12 :** తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మార్చి 16 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిరోజూ ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు జరుగు తాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మిగతా2లో...

## తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత

- నేడు చమురు కంపెనీలతో ప్రభుత్వం చర్చలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,మార్చి 12 :** తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, మిగతా2లో...



## యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే...

**టెహ్రాన్,మార్చి 12 :**ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం 13వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 1300 మంది ఇరానీయులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఇరాన్ కూడా ఏమాత్రం వెనక్కు తగ్గటం లేదు. రెండు దేశాలపై విరుచుకుపడుతోంది. అరబ్ దేశాలలోని అమెరికా ఎయిర్‌బేస్‌లపై దాడులు చేస్తోంది. యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయిల్, గ్యాస్ ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. యుద్ధానికి ముగింపు పలకాలంటే తమ షరతులకు అంగీకరించాల్సిందేనని తేల్చి చెప్పారు. భవిష్యత్‌లోనూ తమ దేశంపై ఎవరూ దాడులు చేయకూడదని అన్నారు. తమ న్యాయపర హక్కులను ప్రపంచం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమాసియాలో శాంతి, భద్రతలకు ఇరాన్ కట్టుబడి ఉందన్నారు. అయితే, ఇరాన్ భద్రతకు గ్యారెంటీ ఇస్తేనే యుద్ధం ఆపుతామని చెప్పారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడినపుడు కూడా ఇదే విషయం చెప్పామని అన్నారు. ఈ క్రమంలో పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా అమెరికా, దాని మిత్ర దేశాల నౌకలపై ఇరాన్ దాడులు తీవ్రమవుతున్నాయి. తాజాగా ఇరాక్ ప్రాదేశిక జలాల్లో రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి జరిగింది. ఈ ఘటనలో ఓ భారతీయుడు మృతిచెందడం గమనార్హం. పర్షియన్ గల్ఫ్‌లో ఇరాక్ తీరం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి గురైన నౌకలను అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, గ్రీస్‌కు చెందిన జెఫిరోస్‌గా గుర్తించారు. సేఫ్‌సీ విష్ణు నౌక మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉండగా.. జెఫిరోస్‌పై మాల్టా జెండా ఉంది. ఈ నౌకలు తీరంలో చమురు సేకరిస్తుండగా పేలుడు పదార్థాలతో ఉన్న 'సూసైడ్ బోటు' వీటిని ఢీకొట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో భారీగా పేలుడు సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రెండు నౌకల్లో ఉన్న 38 మంది సిబ్బందిని రెస్క్యూ టీం సభ్యులు కాపాడారు. ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని భారతీయుడిగా గుర్తించారు. అయితే, అతడి పూర్తి వివరాలు మాత్రం తెలియరాలేదు. ఈ దాడి తమ పనేనని ఇరాన్ (ఎసజీని) ప్రకటించింది. ఈ మేరకు తమ అధికారిక మీడియాలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి మార్గంలో ప్రయాణించే చమురు నౌకలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. బుధవారం కూడా మూడు కమర్షియల్ నౌకలపై డ్రోన్ దాడులు జరిగాయి. వీటిల్లో ఓ నౌక థాయ్ జెండాతో భారత్‌కు వస్తుండగా.. యూఏఈ తీరంలో దాడి జరిగింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అమెరికా డిమాండ్లకు ఒప్పుకోవా లని ట్రంప్ స్పష్టం చేశారు.

## త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం

(మొదటి పేజీ తరువాయి)

శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. అదేవిధంగా నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉంటుంది ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీసీ కెమెరాల వినియోగాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని చిన్న కదలికను సైతం వేను వెంటనే గుర్తించి నిఘాను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలని అందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. 2047 త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష్య సాధనలో పబ్లిక్, ప్రైవేట్ మోడల్ అనివార్యమని ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని పరిశ్రమల శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ సమ ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. మైక్రో, స్మాల్, మీడియం ఇండస్ట్రీస్ లను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనేది ప్రజా ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. రాష్ట్ర నలుమూలలోని యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి తో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న రంగం అని తెలిపారు.

జీసీసీలతో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, ఇదే వేగాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు అన్నారు. డాటా సెంటర్లలో ఎఐ వినియోగాన్నిపెద్ద ఎత్తున చేపట్టాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సివి ఆనంద్, శశాంక డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే తనకు సినిమాలు అంటే ఇష్టం ఇష్టమన్నారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ నగరానికి వచ్చినట్లే అని సీఎం వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతోందని వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్‌సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి డి. శ్రీధర్‌బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈఓ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు.సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. తనకు సినిమాలపైన ఆసక్తి ఉందని.. తన బాల్యం నుంచి ఇప్పటి వరకు చిత్రరంగంలో అనేక మార్పులు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బాహుబలి, కల్కి, ఆర్‌ఆర్‌ఆర్, అరుంధతి వంటి అత్యున్నత సాంకేతికతతో కూడిన సినిమాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. చెన్నైలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని నందమూరి తారక రామారావు , అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తుచేశారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లేనని పేర్కొన్నారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనేనని తాను గతంలోనే చెప్పానని ప్రస్తావించారు. ప్రపంచంలోని 500 పెద్ద కంపెనీలను తెలంగాణకు తీసుకురావడానికి తాము ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో మీ పెట్టుబడికి పూర్తి రక్షణ ఉంటుందని.. తమ రాష్ట్రం అంటేనే వ్యాపారమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## అసెంబ్లీలో రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు ప్రస్తావిస్తా..?

- ప్రభుత్వ తీరును ఎండగడతామన్న హరీష్ రావు



**హైదరాబాద్,మార్చి 12 :** ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగుల పై ముఖ్యమంత్రి కర్కశంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీష్‌రావు ఆరోపించారు. ఉద్యోగులకు రావలసిన హక్కులను వేడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడడం దురదృష్టకరమని అన్నారు. తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం హరీష్ రావును కలిసి వినతి పత్రం అందచేశారు.ప్రభుత్వ తీరు వల్ల బెన్‌ఫిట్లు, పెన్షన్ బకాయిలు రాక మనోవేదనకు గురై ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని , వందల సంఖ్యలో అనారోగ్యం పాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించే వరకు ప్రభుత్వాన్ని వదిలి పెట్టబోమని, రిటైర్డ్ ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ అండగా అంటుందని, అసెంబ్లీ వేదికగా నిలదీస్తామని భరోసా ఇచ్చారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించకపోవడానికి కారణం డబ్బులు లేక కాదు. ముఖ్యమంత్రికి మనసు రాక అని పేర్కొన్నారు. మూసీ బ్యూటిఫికేషన్ కోసం లక్షన్నర కోట్లు, ఫ్యూచర్ సిటీ కోసం లక్ష కోట్లు, అందాల పోటీల కోసం వందల కోట్లు, తన సోకుల కోసం నిర్వహించే ఫుట్‌బాల్ మ్యాచ్‌కు 100 కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ కోసం వందల కోట్లు, వివిధ రాష్ట్రాల్లో వందల కోట్లతో పత్రిక ప్రకటనలు ఇచ్చే రేవంత్ రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించక పోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 98 వేల కోట్లకు టెండర్లు పిలిచారని, బడా కాంట్రాక్టర్లకు 40 వేల కోట్లు చెల్లించారని , కానీ ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతాలు, బెనిఫిట్స్ కోసం మాత్రం డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపించారు. కమీషన్లు రావు కాబట్టి వీరికి బకాయిలు చెల్లించడం లేదని దుయ్యబట్టారు. అసెంబ్లీ సమావేశాల్లో సమావేశాల్లో రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు, చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు.

## 16 నుంచి ఒంటిపూట బడులు

(మొదటి పేజీ తరువాయి)

మధ్యాహ్నం 12:30 గంటలకు భోజనం వడ్డించిన తర్వాత విద్యార్థులను ఇంటికి పంపిస్తారు. టెన్త్ ఎగ్జామ్స్ జరిగే స్కూళ్లలో షెడ్యూల్ మారుతుంది. అక్కడ మధ్యాహ్నం 1:00 గంట నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల దృష్ట్యా యథావిధిగా ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం.. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు విద్యార్థులకు వేసవి సెలవులు ఉండనున్నాయి. తిరిగి 2026-27 విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

## 14 నుంచి పదోతరగతి పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లో 1,582 సెంటర్లు, ప్రైవేట్ బడుల్లో 1,094 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సారి 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్క్వాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. వీరు తమ సెల్‌ఫోన్లను గది బయటే పెట్టాల్సి ఉంటుంది. ఎవరొచ్చినా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. పరీక్షలు జరుగుతుండగానే మూల్యాంకనం కూడా ప్రారంభం అవుతంది. ఈ నెల 14 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనుండగా, ఏప్రిల్ 1 నుంచి జవాబపత్రాల మూల్యాంకనం జరుగనున్నది.

## తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత

(మొదటి పేజీ తరువాయి)

చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. అలాగే పూర్తి వివరాలతో రావాలని ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.రో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

## హార్ముజ్ జలసంధి మూసే ఉంచుతాం

**టెహ్రాన్,మార్చి 12 :** ఇరాన్ అమరవీరుల ప్రతీకారం తీర్చుకుంటామని ఆ దేశ కొత్త సుప్రీం నాయకుడు మొజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రాంతంలోని అమెరికా స్థావరాలను మూసివేయాలని పిలుపునిచ్చారు. హార్మూజ్ జలసంధిని మూసేస్తామని స్పష్టం చేశారు. సుప్రీం లీడర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొజ్తాబా ఖమేనీ తొలిసారి బహిరంగ సందేశాన్ని గురువారం విడుదల చేశారు. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న సంఘర్షణ నేపథ్యంలో అమెరికా, హార్మూజ్ జలసంధిపై కఠినమైన వైఖరిని ప్రస్తావించారు. 'ఈ ప్రాంతంలోని అన్ని అమెరికా స్థావరాలను వెంటనే మూసివేయాలి, లేకపోతే వాటిపై దాడి కొనసాగుతుంది' అని హెచ్చరించారు.కాగా, దాడుల్లో గాయపడి ఇప్పటి వరకు బయటకు కనిపించని సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ప్రకటనను ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌లో ఒక ప్రెజెంటర్ వినిపించారు. హార్మూజ్ జలసంధి మూసివేత కొనసాగించాలని ఒక లెవరేజ్ సాధనంగా అది ఉండాలని ఆయన అన్నారు. పొరుగు దేశాల పట్ల ఇరాన్ విధానం సహకారంగా ఉంటుందని చెప్పడానికి ప్రయత్నించారు. 'ప్రాంతీయ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలకు ఇరాన్ మద్దతు ఇస్తుంది. కానీ అమెరికన్ దళాలకు ఆతిథ్యం ఇవ్వకుండా వారిని హెచ్చరిస్తుంది' అని పేర్కొన్నారు.మరోవైపు ఇరానియన్ల రక్తానికి ప్రతీకారం తీర్చుకోవడానికి తాము వెనుకాడబోమని మొజ్తాబా ఖమేనీ స్పష్టం చేశారు. స్కూల్‌పై క్షిపణి దాడిలో సుమారు 110 మంది పిల్లలతో సహా168 మంది మరణించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పోరాటాన్ని ఆయన ప్రశంసించారు.

## యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం

**ముంబై,మార్చి 12 :** అమెరికా, ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అయితే ఇరాన్ ఆధీనంలోని హార్మూజ్ జలసంధిని ఒక ఆయిల్ ట్యాంకర్ సురక్షితంగా దాటింది. క్షిపణులు, డ్రోన్ దాడుల నుంచి తప్పించుకుని భారత్ చేరుకున్నది. లైబీరియా జెండా కలిగిన చమురు ట్యాంకర్ షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ బుధవారం ఉదయం ముంబై పోర్ట్‌కు చేరుకున్నది. మార్చి 1న సౌదీ అరేబియాలోని రాస్ తనురా ఫిప్‌యార్డ్ నుంచి ఇది బయలు దేరింది. 1,35,335 మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్‌ను భారత్‌కు దిగుమతి చేసింది. కాగా, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో కీలకమైన హార్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆంక్షలు విధించింది. తమ అనుమతి లేకుండా ఈ మార్గంగుండా వెళ్లే నౌకలపై దాడులు చేస్తామని హెచ్చరించింది. దీంతో హార్మూజ్ జలసంధికి ఇరువైపులా అనేక ఆయిల్ ట్యాంకర్లు, కార్గో షిప్‌లు నిలిచిపోయాయి.మరోవైపు అమెరికాతో సహా పలు దేశాలకు చెందిన కొన్ని ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ క్షిపణులతో దాడులు చేసింది. ఇలాంటి యుద్ధ పరిస్థితుల్లో లైబీరియా ఆయిల్ ట్యాంకర్ చాకచక్యంగా హార్మూజ్ జలసంధిని దాటింది. ముంబై పోర్ట్‌లోని జవహర్ ద్వీప్ టెర్మినల్‌కు బుధవారం ఉదయం సురక్షితంగా చేరుకున్నది. దేశంలో చమురు సంక్షోభం నెలకొన్న తరుణంలో తొలి ఆయిల్ ట్యాంకర్ భారత్ చేరడం ఊరట నిచ్చింది.

## స్పీకర్ నిర్ణయమే ఫైనల్..

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ అనంతరం ఉన్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది . ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా.. స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ఇప్పటికే విచారణ జరిపి, తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ సమస్య సభాపతి కార్యాలయంలోనే ముగిసిందన్నారు. సింఘ్వీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంపై స్పీకర్ ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నందున విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది. దీంతో కోర్టు విచారణ ముగిసినట్లేనని వెల్లడించింది. స్పీకర్ ఆదేశాలను రెండు రోజుల్లో అధికారికంగా ప్రచురించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తరువాత పిటిషనర్లకు కావాల్సిన డాక్యుమెంట్లను కూడా నాలుగు రోజుల్లో అందజేయాలని సూచించింది. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు సభాపతి క్లీన్ చిట్ ఇచ్చినట్లైంది. ఈ వ్యవహారంలో పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట దక్కింది. అయితే పోరాడిన బిఆర్ఎస్‌కు మాత్రం న్యాయం దక్కలేదని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. స్పీకర్ తీర్పుపై ఇప్టపికే బిఆర్ఎస్ తన నిరసన తెలియచేసింది. స్పీకర్ తీర్పును సవాల్ చేస్తామన్న బిజెపికి కూడా ఈ తీర్పుతో ఇక అవకాశం లేనట్లుగానే భావించాలి.

## తెలుగు రాష్ట్రాలకు ఎండల నుంచి రిలీఫ్..

**అమరావతి,మార్చి 12 :**పెరుగుతున్న ఎండలతో అల్లాడుతున్న తెలంగాణకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గుడ్‌న్యూస్ చెప్పింది. ఎండల నుంచి రాబోయే రోజుల్లో స్వల్ప ఉపశమనం కలగనుందని తెలిపింది. ఈ నెల 15, 16 తేదీల్లో తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు పడతాయని వెల్లడించింది. ఈ నెల 23 వరకు అనేక జిల్లాల్లో ఇలాంటి పరిస్థితే ఉండొచ్చని ఐఎండీ వివరించింది.ఐఎండీ ప్రకారం.. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడతాయి. తూర్పు, ఉత్తర తెలంగాణలలో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అలాగే ఈదురు గాలులతోపాటు, భారీ వర్షపాతం కూడా నమోదవ్వొచ్చు. పెరుగుతున్న సగటు ఉష్ణోగ్రతలతోపాటు తేమశాతం పెరగడం కూడా ఈ మార్పులకు కారణాలుగా వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అయితే, వర్షాలు పడేవరకు ఎండల ప్రభావం ఎక్కువగానే ఉండనుంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఈ నెల 14 వరకు ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మరోవైపు, అకాల వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రంగారెడ్డి, ఆదిలాబాద్, కరీంగనర్, మహబూబ్ నగర్ జిల్లాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.తెలంగాణతోపాటు ఏపీలో కూడా ఇదేరకమైన వాతావరణం ఉండనుందని ఐఎండీ సైంటిస్టులు అంటున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ ప్రభావంతో కోస్తా తీరంలో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో ఈ నెల 15 నుంచి 17 వరకు వాతావరణం చల్లగా ఉండి, పలు చోట్ల వర్షాలు పడే అవకాశం ఉంది.

## యాదాద్రీశుడిని దర్శించుకున్న గవర్నర్

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామి అమ్మవార్లకు గవర్నర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆ తర్వాత వారికి ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపికతోపాటు ప్రసాదాన్ని అందజేశారు. గవర్నర్ రాక సందర్భంగా యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌గా ప్రతాప్ శుక్లా చేత తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌ను ఈఎస్ఐకి కేటాయించడం సరికాదు సీపీఎం

**-- సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఐలాపురం రాజశేఖర్**



**బాలానగర్ : మార్చి 12 ( పీపుల్స్ న్యూస్)** సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ పరిధిలోని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ మండలం రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌ను ఈఎస్ఐ నిర్వహణకు కేటాయించాలనే నిర్ణయం సరైంది కాదని సీపీఎం పార్టీ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ మేరకు సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఐలాపురం రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాజు కాలనీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటైనప్పటి నుంచి పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని ఆయన తెలిపారు. పేద కుటుంబాలు తమ ఇళ్లలో నిర్వహించలేని శుభకార్యాలు, దశదిన కార్యక్రమాలు వంటి సామాజిక వేడుకలను ఈ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తూ వచ్చారని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడుతున్న ఈ హాల్‌ను ఈఎస్ఐకి కేటాయించడం ద్వారా పేదలకు అందుబాటులో ఉన్న ముఖ్యమైన వసతి కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేల్లో భాగంగా రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌ను ఈఎస్ఐ నిర్వహణకు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం అందిందని రాజశేఖర్ తెలిపారు. అయితే ప్రజలకు నేరుగా ఉపయోగ పడుతున్న ఈ సదుపాయాన్ని నిర్వీర్యం చేయడం సరైంది కాదని ఆయన అన్నారు. అదేవిధంగా ప్రజా పాలన కార్యక్రమంలో 6 గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ, కరోనా సమయంలో టీకాల కార్యక్రమం వంటి అనేక ప్రభుత్వ సేవలు కూడా ఈ కమ్యూనిటీ హాల్ ద్వారానే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని గుర్తుచేశారు. కాబట్టి పేదలకు ఉపయోగపడుతున్న రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌ను అలాగే కొనసాగిస్తూ, ఈఎస్ఐ ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాలని సీపీఎం పార్టీ రాష్ట్ర ప్రభుత్వం మరియు జీహెచ్ఎంసీ అధికారులను కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

## రామప్ప దేవాలయాన్ని సందర్శించిన ఆశన్న







**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 11 (పీపుల్స్ న్యూస్):** మండలంలోని పాలంపేట గ్రామంలో ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయాన్ని ఆగస్టు కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఆశన్న అలియాస్ తక్కల్లపల్లి వాసుదేవరావు సందర్శించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఉమాశంకర్ వారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర శిల్పకళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంటల విజయ్ కుమార్ వారికి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించారు. వారి వెంట వీరమల్ల శ్రీనివాస్ రావు, వకుళాభరణం శ్రీనివాస్, జనగాం నాగరాజు, జూపాక రమేష్, అంజి, టూరిస్ట్ పోలీసులు తదితరులు ఉన్నారు

## బదిలీపై గణపురం వెళ్లిన ఎస్ఐ బోరగాల అశోక్

**మొగుళ్లపల్లి నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎం సురేష్**




**మొగుళ్ళ పల్లి ప్రతినిధి మార్చి 11 (పీపుల్స్ న్యూస్):** గత రెండు సంవత్సరాల క్రితం మొగుళ్లపల్లి ఎస్ఐగా బాధ్యతలను స్వీకరించిన బోరగాల అశోక్ మండలంలోని అన్ని వర్గాల ప్రజలను, వివిధ రాజకీయ పార్టీల నాయకులను, యువతను కలుపుకుపోయి మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, క్రైమ్ రేట్ పెరగకుండా తనదైన శైలిలో విధులు నిర్వర్తించి..ఉత్తమ పోలీస్ అధికారిగా ఎంపికైన బోరగాల అశోక్ ఇటీవల మొగుళ్ళపల్లి నుండి ఇదే భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురంకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా ఎం సురేష్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. మండలంలో చట్టం మరియు శాంతి, భద్రతలను కాపాడేందుకు కట్టుబడి పని చేస్తానన్నారు. ప్రజలు పోలీస్ శాఖపై విశ్వాసం ఉంచి, వారికి ఏవైనా సమస్యలు తలెత్తితే నేరుగా పోలీస్ స్టేషన్ కు వచ్చి తెలియజేయాలన్నారు. నేరాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## ఏ హెచ్ ఎస్ బాలికల హాస్టల్ తనిఖీ చేసిన తహశీల్దార్ గిరిబాబు



**వెంకటాపూర్ ములుగు జిల్లా మార్చి 12 (పీపుల్స్ న్యూస్)**మండలంలోని రామాంజాపూర్ పరిధిలోగల చెంచు కాలనీ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలికల హాస్టల్ ను తహశీల్దార్ గిరిబాబు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను, రిజిస్టర్లను, వంటలను పరిశీలించారు. వివిధ సమస్యలపై హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలపై చర్చించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.వారి వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుధాకర్,హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## బాలానగర్‌లో ఘనంగా దావత్-ఎ-ఇఫ్తార్ కార్యక్రమం

**-- రంజాన్ పండుగ సోదరభావానికి ప్రతీక**
**-- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**బాలానగర్ : మార్చి 12 ( పీపుల్స్ న్యూస్) :**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా బాలానగర్‌లో దావత్-ఎ-ఇఫ్తార్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాని కి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ముస్లిం సోదరులు సంవత్సరంలో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలో ఉండి ఆత్మ నియంత్రణ, సహనం మరియు సేవాభావాన్ని ఆచరిస్తారని పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసం సమాజంలో సోదరభావం, ఐక్యత మరియు పరస్పర గౌరవాన్ని పెంపొందించే గొప్ప పండుగ అని అన్నారు. ఈ నేపథ్యంలో అందరూ సుఖశాంతులతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు, బాలానగర్ డివిజన్‌కు చెందిన ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే బాలానగర్ బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు, వివిధ కాలనీలు మరియు బస్తీల అసోసియేషన్ సభ్యులు కూడా పెద్ద ఎత్తున హాజరయ్యారు. దావత్-ఎ-ఇఫ్తార్ కార్యక్రమం సౌహార్ద వాతావరణంలో కొనసాగగా స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఫిరాయింపులపై కేటీఆర్ అసత్య ప్రచారం మానుకోవాలి

**-- స్పీకర్ తీర్పుపై కేటీఆర్ అసత్య ప్రచారంపై కాంగ్రెస్ మండిపాటు**
**-- మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ ఎ.మదన్ మోహన్**



**బాలానగర్ : మార్చి 12 ( పీపుల్స్ న్యూస్) :**తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తీర్పుపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. గతంలో తమ పార్టీ చేసిన చర్యలను మరిచి ఇప్పుడు నైతిక బోధనలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ ఎ.మదన్ మోహన్ మాట్లాడుతూ.. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో అనేక మంది ప్రజాప్రతినిధులను తమ పార్టీలో చేర్చుకుని పార్టీ ఫిరాయింపుల కు ద్వారాలు తెరిచిందని ఆరోపించారు.ఆకాలంలో 38 మంది ఎమ్మెల్యేలు, 18 మంది ఎమ్మెల్సీలు, ఒక ఎంపీని బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని వారు గుర్తు చేశారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకుని ప్రతిపక్షాన్ని బలహీనపరిచారని విమర్శించారు. దీంతో అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి సరైన ప్రతిపక్ష స్థానం లేకుండా చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఒక దళిత నాయకుడైన మల్లు భట్టి విక్రమార్కను ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా చూడలేకపోవడం బీఆర్ఎస్ వైఖరిని వెల్లడిస్తుందని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. ఇది దళితులకు చేసిన అన్యాయమని వారు పేర్కొన్నారు.ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు ఫిరాయింపుల గురించి బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం“దయ్యాలు వేదాలు వల్లించినట్టే” ఉందని తీవ్రంగా విమర్శించారు. గతంలో జరిగిన రాజకీయ పరిణామాలన్నింటికీ బాధ్యుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.అందుకే ఆయనను రాజకీయ వర్గాల్లో “తెలంగాణ ఫిరాయింపుల పిత గా పేర్కొంటున్నారని కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం స్పీకర్ తీర్పుపై అనవసర ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని బీఆర్ఎస్ నేతలకు మదు మోహన్ సూచించారు.

## డివిజన్-120లో ఘనంగా క్రిస్మస్ విందు & థాంక్స్ గివింగ్ మీటింగ్

**-- ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ మరియు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్**




**బాలానగర్ : మార్చి 12 ( పీపుల్స్ న్యూస్)** తెలంగాణ ప్రభుత్వ మద్దతుతో బాలానగర్ అంబికా కాలనీలో క్రైస్తవ సమాజం సమాగమంలో బండి రమేష్ పాల్గొన్నారు.కూకట్‌పల్లి నియోజకవర్గంలోని డివిజన్-120 పరిధిలో క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో క్రిస్మస్ విందు మరియు థాంక్స్ గివింగ్ మీటింగ్ ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో గాస్పల్ గ్లోబల్ మినిస్ట్రీస్ (జీజీఎం) ఆధ్వర్యంలో బాలానగర్ అంబికా కాలనీలోని ప్రార్థనా మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమం ప్రారంభంలో స్తుతి ఆరాధన కార్యక్రమం నిర్వహించగా రఘు ముద్రి, పీటర్ నాయుడు, మనోజ్ కుమార్, నితిన్ కింగ్స్టన్ మరియు వారి బృందం క్రిస్మస్ ఆరాధన గీతాలను ఆలపించి విశ్వాసులను ఆధ్యాత్మిక భావనలోకి తీసుకువెళ్లారు.ఈ సందర్భంగా గెస్ట్ స్పీకర్‌గా పాల్గొన్న ప్లాంట్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, ఆర్చ్ బిషప్ మరియు మోడరేటర్ ప్రియనాదం క్రిస్మస్ సందేశాన్ని అందిస్తూ ప్రేమ, సేవా భావం మరియు సమాజ సేవపై సందేశాన్ని తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ శ్రీ బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలు, పాస్టర్లకు మరియు చర్చిల అభివృద్ధికి అందిస్తున్న సహాయాన్ని వివరించారు. ప్రభుత్వ మద్దతుతో మైనారిటీల అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. డివిజన్-120 ప్రెసిడెంట్, కెపిఏసీసీఎం పాస్టర్స్ కో-ఆర్డినేటర్ రెవ.డా. ఆర్.ఏ పాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఆయన గాస్పల్ గ్లోబల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడిగా టీబీసీ స్టేట్ పొలిటికల్ వింగ్ చైర్మన్‌గా, కేపీఎం పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్‌గా సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బిషప్స్, పాస్టర్స్, సువార్తికులు మరియు క్రైస్తవ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన వారందరికీ జీజీఎం కమిటీ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కటింగ్ చేసి, హాజరైన వారందరికీ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న క్రైస్తవ సంఘ నాయకులు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం చివరగా “దేవునికే సమస్త మహిమ” అంటూ ప్రార్థనతో ముగించారు.

## ప్రతి మైనారిటీ మహిళ ఆర్థికంగా స్థిరపడాలి ....

**ప్రతి పేదవాడికి సంక్షేమం అందాలి....**
**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**ప్రతి నియోజకవర్గ పరిధిలో సుమారు 200 కుట్టు మిషన్లు పంపిణీ**






**కూసుమంచి/ఖమ్మం/ మార్చి12/(పీపుల్స్ న్యూస్ ):**మైనారిటీ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేస్తుందని రాష్ట్ర, మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండలానికి చెందిన మస్జిద్ కమిటీలకు రంజాన్ గిఫ్ట్ పాకెట్స్, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద ముస్లిం మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని మైనారిటీ సోదరులు ఒక్కపొద్దులు రోజా ఉంటూ అల్లాను ప్రార్థిస్తూ, సర్వ మత ప్రజలందరూ చల్లగా ఉండాలని ప్రార్థనలు చేస్తూ, పవిత్రమైన మనస్సు చాటుతున్నందుకు అభినందనలు తెలిపారు. అల్లా మైనార్టీ సోదరుల కోరిక తీర్చాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి పేదవానికి అండగా ఉంటూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గ పరిధిలో సుమారు 200 కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. మైనారిటీ సోదరీమణులు కుట్టు మిషన్లతో వారి నైపుణ్యాన్ని ఉపయోగించి ఆర్థికంగా ఎదగాలని అన్నారు. మహిళలు కూడా సంపాదించడం ప్రారంభించిన తర్వాత మరింత ఆర్థికంగా స్థిరపడతాయని అన్నారు. అనంతరం పాలేరు నియోజకవర్గానికి చెందిన 163 మంది ముస్లిం మైనారిటీ మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లను, కూసుమంచి మండల మస్జిద్ కమిటీలకి 350 రంజాన్ గిఫ్ట్ పాకెట్స్ లను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజక వర్గ ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైని సర్పంచులతో కలసి సన్మానించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్

**శాలువాతో సన్మానించి స్వీట్ ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన మహిళ సర్పంచ్లు**
**టేకుమట్ల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అమూల్య ను గురువారం పలు గ్రామాల సర్పంచ్ లతో కలసి టేకుమట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్, మర్యాదపూర్వకంగా కలిసి,శాలువాతో సన్మానించారు.**



**టేకుమట్ల ప్రతినిధి మార్చి 12 (పీపుల్స్ న్యూస్)**ఈ సందర్భంగా ఎస్సై మండలంలోని శాంతిభద్రతలకు సహకరించాలని సర్పంచ్ లను కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని సతీష్ గౌడ్ సర్పంచులు ఎస్సై కి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు,గునిగంటి రజనీ మహేందర్ గౌడ్,పొన్నం సాంబయ్య,నాంపల్లి వీరేశం,తోట సునీత సాగర్.వంగ మమత శ్రీధర్.కుర్రె మల్లయ్య.సంగి అంజలి.మారం రచన.అంబాల కిరణ్.నేరెళ్ల రామకృష్ణ. మాజీ ఎంపిటిసి ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి.జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్. మండల కోశాధికారి శాస్త్రాల కిరణ్.తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప చెరువు బోటింగ్ పాయింట్ వద్ద స్వచ్ఛ భారత్





**(రామప్పములుగు జిల్లా ప్రతినిధి మార్చి 12( పీపుల్స్ న్యూస్)** మండలంలోని పాలంపేట గ్రామంలో రామప్ప చెరువు బోటింగ్ పాయింట్ వద్ద ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, సి ఆర్ ఎం యైఆర్కే రాజు ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజపాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని పర్యాటక ప్రాంతాలు అందంగా పరిశుభ్రంగా ఉన్నప్పుడే పర్యాటకులను ఆకర్షిస్తాయని అన్నారు పర్యటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో టిఎస్ టిడిసి ఏఈ విజయ్ కుమార్ టూరిజం గైడ్స్ గోరంటాల విజయ్ కుమార్ వెంకటేష్ టూరిస్ట్ పోలీసులు అరుణ్, ధశరథం బోటింగ్ ఇన్చార్జి సాంబయ్య డ్రైవర్లు గోపాల్ స్వామి సదానందం, కారోబార్ రవి, గ్రామపంచాయతీ సిబ్బంది, హరిత హోటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మానవత్వం చాటుకున్న ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ గౌడ్

## మూగ క్రీడాకారునికి ఆర్థిక సాయం



**రేగొండ ప్రతినిధి మార్చి 12 (పీపుల్స్ న్యూస్):**రేగొండ ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడంలో పోలీసు అధికారులు ఎప్పుడూ ముందుంటారని సబ్ ఇన్స్పెక్టర్ (రా×) గుర్రం కృష్ణ ప్రసాద్ గౌడ్ మరోసారి నిరూపించారు. పెద్దంపల్లి గ్రామానికి చెందిన మూగ క్రికెటర్ పసుల రాజు ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న ఆయన, తక్షణ సాయంగా 5,000 రూపాయల నగదును అందజేశారు.పసుల రాజు వైకల్యాన్ని సైతం లెక్కచేయకుండా క్రికెట్ పట్ల ఉన్న మక్కువతో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. అయితే, పేదరికం కారణంగా క్రీడా సామాగ్రి కొనుగోలుకు, ఇతర ఖర్చులకు ఇబ్బంది పడుతున్న రాజు గురించి తెలుసుకున్న ఎస్సై గారు చొరవ తీసుకున్నారు. పోలీస్ విధుల్లో బిజీగా ఉంటూనే, సామాజిక బాధ్యతతో ఆయన చేసిన ఈ సాయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రైతులకు రాయితీపై జిప్సం పంపిణీ


## -మండల వ్యవసాయ అధికారి పి సురేందర్ రెడ్డి



**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 12( పీపుల్స్ న్యూస్)**రాయితీపై రైతులకు జిప్సం పంపిణీ చేస్తున్నట్లు మొగుళ్ళపల్లి మండల అగ్రికల్చర్ అధికారి పి సురేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిప్సం వలన రైతులకు ఉపయోగపడే విధానాలను వివరించారు. జిప్సం అనేది సోడిక్/లవణ(సౌడు) నేలలను సరిచేయడానికి, నేల నిర్మాణాన్ని మెరుగుపరచడానికి పీహెచ్ ను గణనీయంగా పెంచకుండా కాల్షియం మరియు సల్ఫర్ను సరఫరా చేయడానికి ఉపయోగించే అత్యంత ప్రభావవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన నేల సవరణని, ఇది నీటి చొరబాటును పెంచుతుందని, క్రస్టింగ్ తగ్గిస్తుందని, కోతను తగ్గిస్తుందన్నారు. మరియు భూగర్భ నేలల్లో అల్యూమినియం విషప్రభావం తగ్గించడం ద్వారా మొక్క వేరు పెరుగుదలను మెరుగుపరిచి పంట దిగుబడిని పెంచుతుందన్నారు. 90 శాతం రాయితీపై జిప్సం రైతులకు పంపిణీ చేయడానికి అవకాశం కలదన్నారు. చౌడు భూములలో జిప్సం వేసుకోవడం వలన చౌడు తీవ్రత తగ్గి పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. ఒక టన్నుకు మొత్తం ధర 5, 660 రూపాయలని, ఇందులో 90 శాతం రాయితీ పోను 10 శాతం అనగా ఒక టన్నుకు 566 రూపాయలు రైతులు చెల్లించాలన్నారు. ఈ జిప్సంను 50 కిలోల బస్తాలలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో సన్న, చిన్న కారు మహిళా రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, జిప్సం కావలసిన రైతులు ఒక గ్రూపుగా ఏర్పడి 25 టన్నులకు రైతు వాటా డీడీ చెల్లించినచో ఆ గ్రామానికి జిప్సం లోడు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. జిప్సం కావలసిన రైతులు వారి యొక్క పూర్తి వివరాలతో మీ యొక్క క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని (ఏఈఓ) లేదా మండల వ్యవసాయ అధికారిని (ఎమ్ఏఓ)లను సంప్రదించి రాయితీపై జిప్సంను పొందాలన్నారు.

# రామప్ప దేవాలయం ను సందర్శించిన నీతీ అయోగ్ అధికారులు





**(రామప్ప)ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 11 (పీపుల్స్ న్యూస్)**మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంను నీతీ అయోగ్ గ్రేడ్ 1 అధికారి క్రిష్ణన్ గోపాల్ సందర్శించారు. ఈ సందర్బంగా ఆలయ అర్చకులు ఉమాశంకర్ ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో ఇమ్మడి భాస్కర్ శాలువాతో వారిని సత్కరించారు. ఆలయ చరిత్ర, శిల్పకళ విశిష్టత గురించి టూరిజం గైడ్ గోరంటల విజయ్ కుమార్ వివరించారు. వారి వెంట నీతీ అయోగ్ ములుగు జిల్లా కో ఆర్డినేటర్ రవిష్, దేవాదాయ శాఖ సిబ్బంది అవినాష్, సంతోష్, టూరిస్ట్ పోలీస్ అరుణ్, తదితరులు ఉన్నారు. అనంతరం రామప్ప చెరువు ను సందర్శించారు

# ప్రజాసేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలి

**గ్రామ సభలు నిర్వహించి నిధులను ఖర్చు చేయాలి.**
**ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులుచేపట్టాలి.**
**దేశంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చడానికి కృషి చేయాలి.**
**గ్రామ ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించాలి.**
**99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.**
**రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క.**













**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 12( పీపుల్స్ న్యూస్)**గ్రామాల్లోని సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు గ్రామ ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావిస్తూ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.గురువారం ములుగు మండలం ఇంచర్ల గ్రామం లోని ఎం.ఆర్. ఫంక్షన్ హాల్ లో జిల్లా స్థాయిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా నూతనంగా ఎన్నికైన ములుగు జిల్లాలోని గ్రామ సర్పంచులకు, మున్సిపల్ కౌన్సిలర్లకు మహిళా, శిశు సంక్షేమ, సెర్ప్, వైద్య ఆరోగ్య, విద్యా సంక్షేమ శాఖలు, పర్యావరణ, వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మార్కెటింగ్, సహకార, పౌర సరఫరాల, మున్సిపల్ (పురపాలక), పంచాయతీ రాజ్, పోలీస్ రవాణా, గృహ నిర్మాణ, విద్యుత్, యువజన మరియు క్రీడా శాఖల పై శిక్షణ తరగతులు నిర్వహించగా మహిళా, శిశు సంక్షేమం, వైద్యం పై శిక్షణ కార్యక్రమాన్ని ఉదయం జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. ప్రారంభించారు.జిల్లాలోని గ్రామ సర్పంచులకు, మున్సిపల్ కౌన్సిలర్లకు 12 శాఖలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి మధ్యాహ్నం మంత్రి సీతక్క హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడానికి ప్రతి సర్పంచ్ కృషి చేయాలని అన్నారు. దేశానికి పట్టుకొమ్మలే గ్రామాలను గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రతి సర్పంచ్ తమ గ్రామాన్ని సొంత ఇంటిలో భావించుకోవాలని, ప్రజా ప్రతినిధులు స్వార్థం కోసం పనిచేయకుండా ప్రజాసేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రతి ప్రజా ప్రతినిధి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని, పూర్తిస్థాయిలో సేవలు అందించినప్పుడే ప్రజల గుర్తింపు లభిస్తుందని అన్నారు. గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేయడానికి కేంద్ర ప్రభుత్వం 6 వందల కోట్ల రూపాయలు గ్రామ పంచాయతీలకు కేటాయించిందని, మరో 12 వందల కోట్ల రూపాయలు రావాల్సి ఉన్నాయని ఆ నిధులను తీసుకోరావడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా గ్రామాలలో ప్రజా ప్రతినిధుల ప్రాతినిధ్యం లేకపోయినప్పటికీ గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేయడానికి రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ఒక వెయ్యి మూడు కోట్ల రూపాయలను కేటాయించిందని, ఆనాడు చేసిన పనులకు కొంత మేరకు బిల్లులు చెల్లించగా ప్రస్తుతం 50 కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. ఇటీవల సర్పంచులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినప్పటికీ నేడు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 దృష్టిలో ఉంచుకొని సర్పంచులకు, పురపాలక కౌన్సిలర్లకు 12 శాఖలపై అవగాహన కల్పించడానికి ఈ శిక్షణను ఏర్పాటు చేశామని, శిక్షణలో అవగాహన చేసుకున్న ప్రజాప్రతినిధులు తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తమ గ్రామ పంచాయతీలుగా గుర్తించడానికి తొమ్మిది రకాల అంశాలను పొందుపరచిందని, వాటిని అవగాహన చేసుకుని ఉత్తమ గ్రామ పంచాయతీలుగా గుర్తింపు పొందడానికి కృషి చేయాలని అన్నారు. ఉత్తమ గ్రామపంచాయతీ కోటి రూపాయలు, మరో రెండు గ్రామపంచాయతీలకు అదనంగా నిధులు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుందని వివరించారు. మారుమూల గ్రామాలు వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని సీతక్క తెలిపారు. గ్రామాల అభివృద్ధి విషయంలో సర్పంచుల పాత్ర కీలకం.ప్రభుత్వ ఫలాలు నిజమైన లబ్ధిదారులకు అందే విధంగా చొరువ చూపాలి.

శిక్షణలో నేర్చుకున్న ప్రతి విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలి.

జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. గ్రామాల అభివృద్ధి విషయంలో సర్పంచ్ ల పాత్ర ఎంతో కీలకమైనదని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందచేయడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో వైద్య సేవలు పొందడానికి జిల్లా ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యే వారని నేడు ములుగు జిల్లాకు మెడికల్ కళాశాల రావడమే కాకుండా నర్సింగ్ కళాశాల ఏర్పాటు జరిగిందని, 15 మంది ప్రత్యేక వైద్య నిపుణులచే వివిధ వ్యాధి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు మంచి ఫలితాలను సాధించి ఇక్కడి కళాశాలలోనే వైద్య పట్టా పొందే అవకాశం దక్కిందని, ప్రతి ఒక్కరికి వైద్యం అనేది ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. ప్రస్తుతం 60 శాతం కేసులను పరీక్షించి ఇక్కడే వైద్య సేవలు అందిస్తున్నారని, గత మూడు నెలల క్రితం ఏకంగా రెండు క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు శాస్త్ర చికిత్సలు చేసి విజయవంతం చేశారని హర్షం వ్యక్తం చేశారు.దివ్యాంగులకు పెన్షన్ మంజూరు విషయంలో ప్రభుత్వం నూతన విధానాన్ని అమలులోకి తీసుకవచ్చిందని ధ్రువీకరణ పత్రం స్థానంలో యు డి ఐ డి కార్డును ప్రవేశపెట్టడం జరిగిందని, దివ్యాంగులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే ముందు ఈ కార్డు తప్పనిసరిగా పొంది ఉండాలని అన్నారు.యు డి ఐ డి కార్డు కోసం దివ్యాంగులు మీసేవ కేంద్రాల ద్వారా స్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రతి గురువారం సామాజిక ఏరియా ఆసుపత్రిలో జరిగే సదరం క్యాంప్ కు వైద్య పరీక్షకు హాజరు కావాలని తెలిపారు. క్యాంపు ద్వారా వైద్య పరీక్షలు జరిగిన అనంతరం 30 రోజుల్లో యు డి ఐ డి కార్డు పోస్ట్ ద్వారా నేరుగా తమ చిరునామాకు చేరుతుందని అనంతరం పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా ప్రతి పీహెచ్సీలో గ్రామీణ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్. మహేందర్ జి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ భానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్మెన్ చింతనిప్పుల చంద్ర కళ, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు,మున్సిపల్ కౌన్సిలర్లు,సర్పంచులు పాల్గొన్నారు.

# అవకాశాలు లేని చోట కొత్త వనరులను సృష్టించడమే నా అంతిమ లక్ష్యం

**20 సంవత్సరాల కల నెరవేరింది.**
**ఎవరూ లేని వారికి ప్రజా ప్రభుత్వం అండగా పెద్ద దిక్కుగా ఉంటుంది.**
**జిల్లా అభివృద్ధికి ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం**
**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క**











**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 12 (పీపుల్స్ న్యూస్):**అవకాశాలు లేని చోట నూతన వనరులను కల్పించడమే నా అంతిమ లక్ష్యమని, భోజనం లేని వారికి భోజనం పెట్టడం, నీడ లేని చోట చెట్టు పెట్టడం, ఇల్లు లేనివారికి ఇల్లు సౌకర్యం కల్పించడంలో వచ్చే ఆనందం మాటల్లో చెప్పలేనిదని గుర్రాల బావి గ్రామంలో 20 సంవత్సరాల నెరవేరిందని, ఎవరూ లేని వారికి ప్రజా ప్రభుత్వం పెద్దదిక్కుగా అండగా ఉంటుందని, జిల్లా అభివృద్ధికి ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలకు పూర్తి సహకారం అందిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.గురువారం ఏటూరు నాగారం మండలం గుర్రాల బావి గ్రామంలో హైదరాబాద్కు చెందిన ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఏర్పాటుచేసిన కంటైనర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ వనరులు మరియు అవకాశాలు లేని చోట కొత్త సౌకర్యాలను సృష్టించడమే తమ అంతిమ లక్ష్యామని పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో శాశ్వత భవనాల నిర్మాణానికి అనుమతులు లేని చోట, ప్రత్యామ్నాయంగా కంటైనర్ స్కూళ్లు, హాస్పిటళ్లు మరియు అంగన్వాడీలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.ఇక్కడ ప్రాంతంలో జీవనం కొనసాగిస్తున్న వారు 25 సంవత్సరాల క్రితం ఛత్తీస్గఢ్లోని సల్వాజుడుం ఘర్షణల వల్ల వలస వచ్చిన వారని, వారికి కనీస విద్య, విద్యుత్, నీటి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ ప్రాజెక్టుకు సహకరించిన ఈసీఐఎల్ ,సంతోష్ రామస్వామి వారి బృందాన్ని ఏర్పాటుకు కృషి చేసిన కలెక్టర్, ఎస్పీ, విద్యాశాఖ అధికారును, స్థానిక యువతను మంత్రి సీతక్క అభినందించారు.గతంలో శిథిలావస్థలో ఉన్న భవనాలు లేదా చెట్ల కింద చదువుకునే పిల్లలకు, ఇప్పుడు సురక్షితమైన వాతావరణం కల్పించినందుకు సంతోషం వ్యక్తం చేశారు.ధనికులకు అందరూ స్నేహితులు ఉంటారు, కానీ పేదవారికి ప్రభుత్వమే అసలైన చుట్టంగా వారికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. సేవా దృక్పథం ఉన్న అధికారులు ఉంటే సమాజంలో పేదరికం తగ్గి, అందరూ సమానంగా బతికే అవకాశం ఉంటుందని తెలిపారు. సరైన అవకాశాలు సౌకర్యాలు కల్పిస్తే ఎవరైనా ఉన్నత స్థాయికి ఎదుగుతారని, గతంలో తాము ఏర్పాటు చేసిన స్కూల్ విద్యార్థులు ఇప్పుడు ఇంగ్లీష్లో మాట్లాడుతున్నారని ఉదాహరణగా చెప్పారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాంతం లో ప్రభుత్వ పాఠశాల మంజూరు అయినప్పటికీ కొన్ని కారణాల వలన నిర్మాణం కాలేదని ఇక్కడి విద్యార్థులకు పాఠశాల ఉండాలని ఉద్దేశంతో కంటైనర్ పాఠశాల ఏర్పాటు చేస్తే బాగుంటుంది అనే సదుద్దేశంతో హైదరాబాద్కు చెందిన ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థ వారి సహకారంతో పాఠశాల ఏర్పాటు చేశామని తెలిపారు. సహకారం అందించిన సంస్థను కలెక్టర్ అభినందించారుఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఏటూరు నాగారం ఏ ఎస్ పి, గ్రంథాలయ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, డీఈవో సిద్ధార్థ రెడ్డి,ఈసీఐఎల్ సంస్థ బృందం, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీఎస్ టీం..చిట్యాల పోలీసుల జాయింట్ ఆపరేషన్ లో

**-నిషేధిత గంజాయిని పట్టుకున్న పోలీసులు**
**-ఇద్దరి అరెస్ట్..రిమాండ్ కు తరలింపు**
**-విలేకరుల సమావేశంలో చిట్యాల సీఐ దగ్గు మల్లేష్ యాదవ్ వెల్లడి**




**చిట్యాల ప్రతినిధి మార్చి 12 (పీపుల్స్ న్యూస్)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సంకీర్త్ గౌడ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సీసీఎస్ టీం చిట్యాల పోలీసుల జాయింట్ ఆపరేషన్ లో భాగంగా వాహనాల తనిఖీలను చేపట్టారు. ఈ క్రమంలో బైక్ పై అనుమానాస్పదంగా వెళుతున్న ఇద్దరినీ ఆపి తనిఖీ చేయగా..వారి వద్ద నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకొని వారిద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు చిట్యాల సీఐ దగ్గు మల్లేష్ యాదవ్ వెల్లడించారు. గురువారం ఆయన చిట్యాల పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుధవారం సాయంత్రం సీసీఎస్ టీం చిట్యాల పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా..అటువైపు నుంచి అనుమానస్పదంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరినీ ఆపి తనిఖీలు చేయగా..వారి వద్ద నుంచి 1 కిలో 300 గ్రాముల నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ 65 వేలు ఉంటుందని, గంజాయితో పాటు బైక్, సెల్ ఫోన్ ను ఫీజ్ చేశామన్నారు. గురువారం నిందితులిద్దరిని అరెస్టు చేసి, నిందితులపై ఎన్ డీ పీ ఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా..కోర్టు రిమాండ్ విధించిందన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ తరహా అక్రమ కార్యకలాపాలపై ప్రజలు నిర్భయంగా సమాచారం అందించాలని కోరారు. మదకద్రవ్యాల అక్రమ రవాణాపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఎవరికైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే 100కు డయల్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో చిట్యాల ఎస్ఐలు పోచంపల్లి సతీష్, హేమ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ములుగు బ్రాంచ్ వారు బీమా చెక్ అందజేత :



**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 12 ( పీపుల్స్ న్యూస్)** మల్లంపల్లి గ్రామానికి చెందిన పోలయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది అందుకు నామిని అయినా పుడమి జ్యోతి కి సర్పంచి శ్యామ్ రావు చేతుల మీదుగా చెక్కు1210140/- ఇవ్వడం జరిగింది ఇతను రెండు సంవత్సరాలు కట్టిన తర్వాత ఇలా జరిగింది సంవత్సరానికి 89732/-రూపాయల పాలసీ తీసుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీజిఎం సతీష్ సార్ డిఎం వినయ్ మేనేజర్ కోసాని ప్రశాంత్ కుమార్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ అజ్మీర శ్రీకాంత్, మునుకుంట్ల కార్తీక్, భాస్కర్, మహేశ్వరి డివోలు జరుకుల రాజు అన్నం నారాయణస్వామి పోరిక రజిత కొక్కుల రాజేందర్ ఆలేటి రాజేందర్ బల్ల రాకేష్, సంగిరెడ్డి సాంబయ్య, రాజ ప్రమీల, క్యాతం కవిత, వడ్డేపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల అభిమానం చూరగొనెలా ప్రజా ప్రతినిధులు సేవ చేయాలి....

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**





**ఖమ్మం/మార్చి12/(పీపుల్స్ న్యూస్ ):**ఫలానా నాయకుని హయంలో మా ప్రాంతం బాగా అభివృద్ధి చెందిందని ప్రజల మన్ననలు పొందేలా ప్రజా ప్రతినిధులు పని చేయాలని రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి, రాష్ట్ర కేబినెట్ ఆలోచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నామని, ప్రజల కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గురించి అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన లబ్ధిదారు లకు అవి చేరేలా చూడాలని తెలిపారు.


డబ్బు సంపాదించడం కోసం ప్రజా ప్రతినిధులు ఎవరు రాజకీయంలోకి రాలేదని అన్నారు. సర్పంచ్ నుంచి కలెక్టర్ వరకు ప్రజలకు సేవ చేసే అవకాశం భగవంతుడు మనకు అందించారని, మనం అధికారంలో ఉన్న సమయంలో గ్రామంలో మంచి అభివృద్ధి జరిగింది, మంచి పనులు జరిగాయనే మంచి పేరు సంపాదించాలని తాపత్రయ పడతామని మంత్రి అన్నారు.ఓట్లు వేసిన ప్రజలకు మంచి చేయాల్సిన బాధ్యత మనపై నేడు ఉందని అన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కొంత సమయం కేటాయిస్తే క్షేత్రస్థాయిలో మంచి మార్పు కనిపిస్తుందని అన్నారు. పాలక వర్గాలు లేక గ్రామాలకు నిధులు రాలేదని, గత నెలన్నర కాలంలో పెద్ద ఎత్తున నిధులు విడుదల అయ్యాయని, మార్చి 31 లోపు మరిన్ని నిధులు విడుదల అవుతాయని మంత్రి తెలిపారు. చట్ట పరిధిలో నిధులను సద్వినియోగం చేయాలని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా కాపలాదారుగా ఉండాలని తెలిపారు.పేద ప్రజలకు నిరంతరం మంచి చేసే విధంగా, రాజకీయాలకతీతంగా ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం గెలిచిన ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి ఆ ప్రాంతాల అభివృద్ధి కోసం పని చేయాలని కోరారు.రాబోయే వేసవిలో త్రాగునీటి సమస్య ఏ గ్రామంలో లేకుండా ఉండే విధంగా అధికారులు, నూతన ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని మంత్రి సూచించారు.గ్రామాలలో సమస్యలు కేవలం డబ్బుతో మాత్రమే పరిష్కారం కావని అన్నారు. సిసి రోడ్ల, డ్రైయిన్ నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టడం చాలా కీలకమని అన్నారు. గ్రామాలలో నిర్మించే నూతన రోడ్లు, డ్రైయిన్ సమయంలో అధికారులు ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ అధికంగా ఉండాలని, ఎక్కడ కూడా మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు.


ప్రజలతో నిరంతరం ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉంటూ సమయస్ఫూర్తితో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని అన్నారు. నేటి శిక్షణ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు సరిగ్గా వినియోగించు కోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతం చేసేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయడం కీలకమని తెలిపారు. 99 రోజుల కార్యక్రమం పై స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నేడు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు నేటి శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక సంస్థల ప్రజా ప్రతి నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటే క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఇంటరాక్టివ్ సెషన్ లాగా నేటి శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమకు ఉన్న సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, డిఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, పంచాయతీ రాజ్ డిప్యూటీ కమీషనర్, జిల్లా ప్రత్యేక అధికారిణి విద్యాలత, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, డిపిఓ రాంబాబు, డిఆర్డిఓ కె. శ్రీరామ్, సిపిఓ ఏ. శ్రీనివాస్, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ రామారావు, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. విజయలక్ష్మి, అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ చందు నాయక్, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు, సర్పంచులు, మునిసిపల్ చైర్ పర్సన్లు, వార్డు కౌన్సిలర్ లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శక్తికి మగువ లయన్స్ క్లబ్ కొత్త నాయకత్వం...!!

**రామగుండం "మగువ" లయన్స్ క్లబ్ అధ్యక్షురాలిగా అర్చన అంబటి ఎన్నిక**
**మహిళా సాధికారతకు సేవా కార్యక్రమాలే లక్ష్యం**
**కొత్త కార్యవర్గంతో ముందుకు మగువ లయన్స్ క్లబ్**







**గోదావరిఖని, మార్చి 12 (పీపుల్స్ న్యూస్):**సమాజ సేవలో చురుకైన పాత్ర పోషిస్తున్న రామగుండం "మగువ" లయన్స్ క్లబ్‌కు 2026--2027 సంవత్సరానికి నూతన అధ్యక్షురాలిగా ఇరిగేషన్ శాఖలో ఇంజినీర్‌గా పనిచేస్తున్న లయన్ శ్రీమతి అర్చన -- సంతోష్ రావు అంబటి ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన క్లబ్ ఎన్నికల్లో ఆమెను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా క్లబ్ నూతన కార్యవర్గాన్ని కూడా ప్రకటించారు. సెక్రటరీగా ఎతిరాజ్ భవాణి, ట్రెజరర్‌గా చిందం స్వరూప పటేల్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే వైస్ ప్రెసిడెంట్లుగా శశికల మరియు సద్గుణలను ఎంపిక చేశారు. క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా గాలి సునీతను నియమించారు. ఇతర కార్యవర్గ సభ్యులుగా సుష్మ సింగ్, బీనా సింగ్, రజిత, పద్మ, జ్యోతిలను ఎంపిక చేస్తూ నూతన బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు నూతన అధ్యక్షురాలు అర్చన అంబటి మరియు కార్యవర్గ సభ్యులను ఘనంగా అభినందించారు. అధ్యక్షురాలిగా ఎన్నికైన అర్చన అంబటి మాట్లాడుతూ, రామగుండం ప్రాంతంలో మహిళల అభివృద్ధి, మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, సామాజిక సేవ రంగాల్లో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించి మగువ లయన్స్ క్లబ్ సేవా భావాన్ని మరింత బలపరుస్తామని పేర్కొన్నారు. క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, అర్చన అంబటి నాయకత్వంలో మగువ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# డిసెంబర్ తొమ్మిది నాటికీ తెలంగాణ లోనే మోడల్ కాలనీ గా వెలుగుమట్లను తీర్చిదిద్దుతాం...

**పేదలు ఆత్మ గౌరవంతో జీవించటం ప్రభుత్వ బాధ్యత.**
**రాష్ట్రమంత్రి వర్యులు, తుమ్మల నాగేశ్వర రావు.**
**వెలుగుమట్ల భూదాన్ భూములలో 38 ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల**





**ఖమ్మం/ మార్చి12/(పీపుల్స్ న్యూస్ )** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం వెలుగుమట్ల భూదాన్ భూములలో 38 ఇండ్ల నిర్మాణ పనులకు ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి శంకుస్థాపన చేశారు.మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ పేదరికం ఆసరా చేసుకొని ధనార్జన కోసం దళారులను అడ్డుపెట్టి ఇతర జిల్లా, రాష్ట్రాల వారిని రెచ్చగొట్టి ఫేక్ డాక్యు మెంట్ లతో భూమి పేదలకు మోసపూరితంగా అప్పగించారని తెలిపారు. 1953 లో ఆసామి 31 ఎకరాల 7 గుంటల భూమి దానం చేశారని తెలిపారు.గత 8 సంవత్సరాల కాలంలో అనేక సమస్యలు పేదలు ఎదుర్కొన్నారని, త్రాగునీటి, విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పన లేకుండా బాధలు పడ్డారని తెలిపారు. కరెంట్, మంచి నీరు ప్రతి అంశానికి డబ్బులు డిమాండ్ చేస్తూ మాఫియా నడిపించారని మంత్రి తెలిపారు. పేదలను దిన దిన గండం నుంచి కాపాడాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించిందని అన్నారు. భూదాన్ భూములు ఆక్రమించుకోవాలని సిసిఎల్ఏ ఇచ్చిన ఆదేశాల ప్రకారం కూల్చివేతలు జరిగాయని అన్నారు.మోడల్ కాలనీగా వెలుగు మట్లను తీర్చి దిద్దుతామని, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించిన తల్లి సోనియాగాంధీ పుట్టిన రోజు డిసెంబర్ 9 నాటికి కాలనీ పూర్తి చేస్తామని తెలిపారు. పేదలకు పంచిన తర్వాత మిగిలిన భూమిలో స్కూల్, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. నిరుపేదలకు సున్నా వడ్డీతో రుణాలు అందిస్తామని తెలిపారు. పేదలకు ఇంటి నిర్మాణంలో హౌసింగ్ శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. వెలుగుమట్ల లేఔట్ లో కరెంటు పోల్స్, విద్యుత్ సరఫరా పనులు యుద్ధ ప్రాతిపదికన ఉగాది లోపు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.మిషన్ భగీరథ ద్వారా త్రాగునీటి పైప్ లైన్ పనులు చేపట్టాలన్నారు.దళారులకు ఎవరు ఎంత డబ్బులు ఇచ్చారు వివరాలు పోలీసు అధికారులకు అందించాలని అన్నారు. ప్రజలను మోసం చేసిన ఎవరిని విడిచి పెట్టే సమస్య లేదని కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్,హౌజింగ్ పిడి శ్రీనివాస్,ప్రజా ప్రతినిధులు,సంబంధితశాఖలఅధికారులు,పాల్గొన్నారు.

# ప్రమాద రహిత పరిశ్రమలను ప్రోత్సహించడానికి భద్రతా సమన్వయ సమావేశం

**డీసీపీ కుత్బుల్లాపూర్ జోన్ ఎన్ కోటి రెడ్డి.**






**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మార్చి 12 (పీపుల్స్ న్యూస్) :** ప్రమాద రహిత పరిశ్రమలను ప్రోత్సహించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామని డీసీపీ కుత్బుల్లాపూర్ జోన్ ఎన్ కోటి రెడ్డి తెలిపారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం రమేష్ రెడ్డి ఆదేశాల మేరకు, సైబరాబాద్ పోలీస్ జీడిమెట్లలో పారిశ్రామిక భద్రతా సమన్వయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సంస్థలు,పారిశ్రామికవేత్తలు, ఫ్యాక్టరీ యజమానులు,భద్రతా అధికారులు , నిపుణులు సమావేశమై, సమర్థవంతమైన భద్రతా చర్యలను చర్చించారు, ఉత్తమ పద్ధతులను పంచుకున్నారు .స్టేక్‌హోల్డర్‌ల మధ్య సహకారాన్ని పెంపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు , ఉద్యోగుల మధ్య భద్రత ఒక ఉమ్మడి బాధ్యత అని అన్నారు. ప్రమాద రహిత పరిశ్రమలను ప్రోత్సహించడానికి, భద్రమైన పని వాతావరణాన్ని కల్పించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్పష్టమైన అత్యవసర ప్రతిస్పందన ప్రణాళికలు, నియమ నిబంధనల పాటించడం ,బలమైన రిస్క్ మేనేజ్మెంట్ సిస్టమ్స్ యొక్క ప్రాముఖ్యత గురించి చర్చించారు. సమర్థవంతమైన భద్రతా నిర్వహణకు సహకారం , సమన్వయం కీలకం" అని అన్నారు. ఎస్‌హెచ్‌ఓ జీడిమెట్ల మల్లేశ్ అన్ని శాఖలతో సమన్వయం చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సమావేశం భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, భద్రతా కార్యక్రమాలలో పాల్గొనాలని , జీడిమెట్లను సురక్షిత ప్రాంతంగా మారుద్దాం అని పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో పీసీబీ ఈఈ రాజేందర్,టీ.జీఐఐసీ జోనల్ మేనేజర్ మధు, ఏసీపీ కుత్బుల్లాపూర్ బాల గంగి రెడ్డి, ఏడీ ఎలక్ట్రిసిటీ వీరేశం , ప్రేమ్ కుమార్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శేఖర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ ఫాక్టరీస్ నితిన్, జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రంగా రాజు,ఐలా చైర్మన్ పీడిఎస్ఎన్ రాజు, హైడ్రా ఇన్స్పెక్టర్ , వివిధ కంపెనీలకు చెందిన 250 మంది పారిశ్రామికవేత్తలు , ఉద్యోగులు పాల్గొన్నారు


# అపరమేధావి డా. దివ్యమూర్తిని ఘనంగా సన్మానించిన మండల బిజెపి పార్టీ అధ్యక్షులు పాగర్తి సుధాకర్



**నేలకొండపల్లి/ఖమ్మం/మార్చి 12/(పీపుల్స్ న్యూస్ ):**అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తిని నేలకొండపల్లి మండల బిజెపి పార్టీ అధ్యక్షులు పాగర్తి సుధాకర్ మరియు ఇతర బిజెపి నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమం నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామంలో గల బిజెపి పార్టీ మండల ఉపాధ్యక్షులు సూరేపల్లి జ్ఞానరత్నం గృహంలో గురువారం నాడు జరిగింది.పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ డాక్టర్ దివ్యమూర్తి చాలా ప్రతిభావంతుడని, తన పరిజ్ఞానంతో అనేకమందిని ముఖ్యంగా యువతని చైతన్యం చేస్తున్నారని, విద్యార్థులలో జ్ఞాపకశక్తి మెలకువలు పెంపొందించే కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. ఈ సన్మానం జరగడం తనకు సంతోషంగా ఉందని దివ్యమూర్తి తెలియజేశారు. ఇప్పటివరకు 124 వేదికల మీద సన్మానం జరిగిందని దివ్యమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల బిజెపి పార్టీ మండల ఉపాధ్యక్షులు సూరేపల్లి జ్ఞాన రత్నం, మొహినుద్దీన్, రామచంద్రపురం బిజెపి నాయకులు స్వామిదాసు, నేలకొండపల్లి బిజెపి పార్టీ సోషల్ మీడియా ప్రతినిధి కందరబోయిన గోపి, కట్టెకోల వెంకటేశ్వర్లు, వడ్లమూడి శ్రీనివాసరావు, ఏపూరి ఎల్లమ్మ,తదితరులు పాల్గొన్నారు.


# జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం

**జమ్ముకశ్మీర్ :** మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఆయనతో పాటు జమ్ముకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ ఛౌదరి కూడా అన్నారు. జమ్ములోని ఓ వివాహ వేడుకకు హాజరై తిరిగి వెళ్తుండగా వారిపై కాల్పులు జరిగాయి. భద్రతా సిబ్బంది అప్రమత్తతతో ఇద్దరు వీవీఐపీలు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. మరోవైపు భద్రతా వైఫల్యం కారణంగా ఈ ఘటన జరిగినట్లు జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు.బుధవారం జమ్ములోని గ్రేటర్ కైలాష్ ప్రాంతంలో ఉన్న రాయల్ పార్క్‌లో జరిగిన నేషనల్ కాన్ఫరెన్స్ నేత కుమార్తె పెళ్లికి ఫరూక్ అబ్దుల్లా హాజరయ్యారు. ఆయనతో పాటు జమ్ముకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ ఛౌదరీ, ముఖ్యమంత్రి సలహాదారుడు ఉన్నారు. కార్యక్రమం ముగించుకుని బయటకు వస్తున్న సమయంలో ఓ వ్యక్తి వెనక నుంచి ఫరూక్?పై పాయింట్ రేంజ్‌లో తుపా కీతో కాల్చేందుకు ప్రయత్నించాడు. అయితే అక్కడ భద్రతా విధు ల్లో ఉన్న ఒక ఇన్‌స్పెక్టర్, సబ్‌ఇన్‌స్పెక్టర్ వెంటనే స్పందించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఒక రౌండ్ కాల్పులు జరిపినప్పటికీ ఎవరూ గాయపడలేదు. ఘటన తర్వాత భద్రతా సిబ్బంది ఫరూక్? అబ్దుల్లాను వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు కూడా వెలుగులోకి వచ్చాయి.20 ఏళ్లుగా ఫరూక్ అబ్దుల్లాను




చంపాలని ప్లాన్నిందితుడు జమ్ములోని పురాణీ మండీ ప్రాంతానికి చెందిన కమల్ సింగ్? (63)గా పోలీసులు గుర్తించారు. అతడు గత 20 ఏళ్లుగా ఫరూక్ అబ్దుల్లాను చంపాలని కుట్ర చేస్తున్నట్లు విచారణలో తెలిపాడు. నిందితుడి వద్ద ఉన్న లైసెన్స్ గన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటన సమయంలో నిందితుడు కమల్ సింగ్ మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఉగ్రవాద సంబంధం లేదని ప్రాథమికంగా గుర్తించినట్లు చెప్పారు. అయితే ఈ ఘటన తర్వాత ఫరూక్ అబ్దుల్లా ఇంటి వద్ద భద్రతను పెంచినట్లు జమ్ము సౌత్ పోలీసు సూపరింటెండెంట్ అజయ్ శర్మ తెలిపారు.దేవుని దయతో తృటిలో తప్పింది : ఒమర్ అబ్దుల్లాతన తండ్రిపై జరిగిన హత్యాయత్నంపై జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆందోళన వ్యక్తం చేశారు. జడ్ ప్లస్ కేటగిరీ రక్షణలో ఉన్న వ్యక్తికి ఇంత దగ్గరగా దుండగుడు ఎలా రాగలిగారని ఆయన ప్రశ్నించారు. దేవుతి దయతో తన తండ్రి తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారని చెప్పారు. ఆ సమయంలో ఉపముఖ్యమంత్రి సురీందర్ చౌదరీ, ఇతర నేతలు కూడా ఉన్నారని చెప్పారు.భద్రతలో భారీ లోపంఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి సురిందర్ చౌధరీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ సీఎం, ఉప ముఖ్యమంత్రి, సీఎం సలహాదారు ఉన్న కార్యక్రమంలో ఒక వ్యక్తి తుపాకీతో లోపలికి రావడం చాలా పెద్ద భద్రతా లోపమని అన్నారు.ఖండించిన రాజకీయన నేతలుజమ్ముకశ్మీర్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా ఈ ఘటనపై ఆందోళ వ్యక్తం చేస్తూ భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తారు. జమ్ములో పెళ్లి వేడుక సందర్భంగా ఫరూక్ అబ్దుల్లా, సురీందర్ ఛౌదరీపై కాల్పులు జరిపిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలాంటి హింసాత్మక ఘటనలు చాలా ఆందోళన కలిగిస్తున్నాయని, దానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. పీపుల్స్? కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే సజాద్? లోన్ ఈ ఘటనను ఖండించారు. దేవుని దయతో వారు సురక్షితంగా బయటపడ్డారని అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ ఎంపీ అగా రుహుల్లా మెహ్దీ కూడా ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

# మహారాష్ట్ర అసెంబ్లీకి బాంబు బెదిరింపు.. భారీ భద్రత మధ్య సమావేశాలు



**ముంబై, మార్చి 12:** మహారాష్ట్ర అసెంబ్లీకి బాంబు బెదిరింపులు రావటంతో తీవ్ర కలకలం చెలరేగింది. ముంబైలోని విధాన్ భవన్‌లో బాంబు పెట్టామంటూ గుర్తు తెలియని దుండగులు గురువారం ఉదయం అధికారులకు మెయిల్ పెట్టారు. మెయిల్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. బాంబ్ స్క్వాడ్ బృందాన్ని రంగంలోకి దింపారు. అసెంబ్లీలోని వారిని దూరంగా పంపించేశారు. బాంబ్ స్క్వాడ్‌తో పాటు పోలీసులు కూడా తనిఖీలు నిర్వహించారు. అసెంబ్లీలో ఎలాంటి బాంబు లేదని తేలింది. దర్యాప్తు అధికారులు బెదిరింపులకు పాల్పడ్డ వారికోసం అన్వేషిస్తున్నారు.బాంబు బెదిరింపుల నేపథ్యంలో అసెంబ్లీలో సెక్యూరిటీ కట్టుదిట్టం అయింది. మీడియా, అసెంబ్లీ సిబ్బంది, సాధారణ జనానికి అధికారులు అనుమతి ఇచ్చారు. ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. భారీ భద్రత మధ్య ఈ రోజు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఇక, సైబర్ సెల్ అధికారులు ఆ మెయిల్ ఎక్కడినుంచి వచ్చిందన్న దానిపై దృష్టి సారించారు. ఫోరెన్సిక్ నిపుణులు డిజిటిల్ ఫుట్ ప్రింట్స్ కోసం వెతుకుతున్నారు.ఇక, ఈ సంఘటనపై మహారాష్ట్రం హోం మంత్రి పంకజ్ మాట్లాడుతూ.. 'గురువారం ఉదయం 6.27 గంటలకు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. విధాన్ భవన్‌తో పాటు, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, హైకోర్టుకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. ప్రాథమిక దర్యాప్తులో ఆ మెయిల్ ఫేక్ అని తేలింది. అధికారులు మెయిల్ పంపిన వ్యక్తిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు' అని తెలిపారు.

# బైండోవర్ నిబంధనల ఉల్లంఘన: రౌడీషీటర్‌కు నెల రోజుల జైలు శిక్ష




**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మార్చి 12, (పీపుల్స్ న్యూస్) :** శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, నేర ప్రవృత్తిని వీడని అసాంఘిక శక్తులపై హైదరాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. పాతబస్తీలోని ఫలక్‌నుమా డివిజన్ పరిధిలో బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన ఒక రౌడీషీటర్‌కు న్యాయస్థానం నెల రోజుల జైలు శిక్ష విధించినట్లు రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్, ఒక ప్రకటనలో తెలిపారు.కేసు వివరాలు: కామాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలో 'మహ్మద్ రియాజుద్దీన్ అలియాస్ రియాజ్' అనే వ్యక్తిపై రౌడీషీట్ నమోదై ఉంది. గతంలో అతనిని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కింద ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తాను ఎటువంటి నేరాలకు పాల్పడనని, శాంతియుతంగా ఉంటానని అతను బాండ్ రాసి ఇచ్చాడు. అయితే, బైండోవర్ పీరియడ్‌లో ఉండగానే రియాజుద్దీన్ తిరిగి కొత్త నేరానికి పాల్పడటాన్ని పోలీసులు గుర్తించారు. ఇది అతను గతంలో రాసి ఇచ్చిన బాండ్ నిబంధనలకు ప్రత్యక్ష ఉల్లంఘన కావడంతో, కామాటిపుర పోలీసులు తక్షణమే స్పందించారు. నిందితుడిని హైదరాబాద్ జిల్లా స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కె. జ్యోతి ముందు ప్రవేశపెట్టి, బాండ్ రద్దు చేయాలని పోలీసులు కోరారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్, నిందితుడు దోషిగా తేలడంతో అతనికి ఒక నెల (30 రోజులు) సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు రియాజుద్దీన్‌ను అదుపులోకి తీసుకుని, న్యాయపరమైన ఫార్మాలిటీస్ పూర్తి చేసిన అనంతరం శిక్ష అనుభవించే నిమిత్తం చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని, . బైండోవర్ నిబంధనలు అతిక్రమించే రౌడీషీటర్లు , అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు కొనసాగుతాయన్నారు.

# దేశంలో ఎల్పీజీ కొరత- శిర్డీలో ప్రసాదం తయారీపై ప్రభావం- పెళ్లిళ్లపై కూడా ఎఫెక్ట్

**శిర్డీ :** ఇరాన్ యుద్ధం వల్ల భారత్‌లో గ్యాస్ కొరత ఏర్పడింది. ఈ ప్రభావం దేశంలోని పలు దేవాలయాలు, పెళ్లిళ్లపై పడింది. దీంతో శిర్డీలోని సాయిబాబా ఆలయ అధికారులు భక్తుల కోసం ప్రసాదం సిద్ధం చేయడంపై ఆందోళన చెందుతున్నారు. ఎల్పీజీ కొరత దృష్ట్యా బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) క్యాంటీన్ సేవలను మరో రెండు రోజుల్లో మూసివేయనుంది.శిర్డీ ఆలయంలో గ్యాస్ కొరతశిర్డీ సాయిబాబా గుడిలోని ప్రసాదాలయంలో రోజూ 40,000 వేల మంది భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేస్తారు. ఈ ప్రసాదాన్ని సిద్ధం చేయడానికి అర టన్ను ఎల్పీజీ గ్యాస్ వినియోగం అవుతుంది. అయితే గ్యాస్ కొరత వార్తలు ఆలయ అధికారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం శిర్డీ సాయిబాబా సంస్థాన్‌లో 14రోజులపాటు ప్రసాదం తయారుచేయడానికి సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయి.అయితే ఇజ్రాయెల్, అమెరికా-ఇరాన్ యుద్ధం మరికొన్ని రోజులు కొనసాగితే మాత్రం శిర్డీ ఆలయంలో ఎల్పీజీ కొరత ఏర్పడే అవకాశం ఉంది. అప్పుడు ప్రసాదం చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. ఈనెల చివర్లో శ్రీరామనవమి పండగ జరగనుంది. అప్పుడు గుడిలో లడ్డూలు, బూందీల తయారీని ఆపేయాల్సి వస్తుందని శిర్డీ సాయిబాబా సంస్థాన్ అధికారులు భయపడుతున్నారు.
2009లో ప్రసాదాలయంలో రోజుకు 200 కిలోల ఎల్పీజీని ఆదా చేసే సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామని శిర్డీ సాయిబాబా సంస్థాన్ పరిపాలనా అధికారి అతుల్ బాగ్ చెప్పారు. దీని ద్వారా వచ్చే సౌర శక్తితో ప్రతిరోజు ఐదు టన్నుల బియ్యం, పప్పు వండుతున్నామని తెలిపారు. ఇంధన కొరత ఏర్పడే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ సౌర విద్యుత్ వ్యవస్థపై ప్రసాదాన్ని తయారుచేస్తున్నామని పేర్కొన్నారు."మేము ఇప్పుడు 1.5 టన్నుల గ్యాస్ ఆదా చేస్తున్నాం. అలాగే ఎల్పీజీని నిల్వ చేయడానికి 10 టన్నుల సామర్థ్యం గల రెండు ట్యాంకులను ఏర్పాటు చేశాం. ఈ ట్యాంకులలో గరిష్ఠంగా 20,000 కిలోల గ్యాస్ నిల్వ చేయవచ్చు" అని అతుల్ బాగ్ స్పష్టం చేశారు.కలపను సిద్ధం చేస్తున్న దేవాలయాలుఅలాగే కర్ణాటకలోని పలు దేవాలయాలపై ఎల్పీజీ కొరత ప్రభావం పడింది. ఈ క్రమంలో ప్రసాదం తయారీకి కలపను నిల్వ చేస్తున్నాయి. ఇదే విషయంపై అఖిల కర్ణాటక హిందూ ఆలయ అర్చకుల సమాఖ్య అధ్యక్షుడు ఎంఎస్ వెంకటాచల్లయ్య స్పందించారు. కర్ణాటకలోని దేవాలయాలలో తక్షణ గ్యాస్ సంక్షోభం లేదన్నారు. "మా వద్ద ఒక వారానికి సరిపడా ఎల్పీజీ సిలిండర్ స్టాక్ ఉంది. అయితే గ్యాస్ కొరత తర్వాత కొనసాగితే భక్తులకు ప్రసాదం అందించడంలో సమస్యలు ఎదురవుతాయి. ఎల్పీజీ సంక్షోభాన్ని అధిగమించడానికి రాష్ట్రంలోని అనేక దేవాలయాలు కలపను నిల్వ చేయడం ప్రారంభి పెద్దగా ఆధారపడటం లేదు. ఎల్పీజీ సంక్షోభం మమ్మల్ని పెద్దగా ప్రభావితం చేయలేదు. మా వంటశాలలు స్టీమ్ ఆధారితమైనవి. అందుకే గ్యాస్‌ను చాలా తక్కువ మొత్తంలో వినియోగిస్తాం" అని అక్షయ పాత్ర ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ తెలిపారు. క్యాంటీన్‌పై గ్యాస్ కొరత ఎఫెక్ట్అలాగే ఎల్పీజీ కొరత బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌ను (దీవీజ) తాకింది. బీఎంసీ క్యాంటీన్ సేవలను మరో రెండు రోజుల్లో మూసివేయనున్నారు. అలాగే వంట కోసం ఎలక్ట్రిక్ గ్రిల్‌ను ఉపయోగించడానికి అనుమతి కోరినట్లు బీఎంసీ క్యాంటీన్ మేనేజర్ ఈటీవీ భారత్‌కు వెల్లడించారు. "క్యాంటీన్‌లో ఉన్న గ్యాస్ స్టాక్ గురువారం వరకు మాత్రమే సరిపోతుంది. ఎల్పీజీ సిలిండర్ల కొరత కారణంగా ఇతర ప్రభుత్వ క్యాంటీన్లు కూడా మూతపడుతున్నాయి. కాబట్టి ఇతర ప్రభుత్వ క్యాంటీన్ల నుంచి ప్రజలు భోజనం కోసం మా బీఎంసీ క్యాంటీన్‌కు వస్తున్నారు. దీని కారణంగా రద్దీ పెరిగింది. ఈ సమస్యను కార్మిక శాఖకు నివేదించాం. గ్యాస్ అందుబాటులో లేకపోతే క్యాంటీన్‌లో ఎలక్ట్రిక్ గ్రిల్స్‌ను ఉపయోగించడానికి కూడా మేము అనుమతి కోరాం" అని బీఎంసీ క్యాంటీన్ మేనేజర్ తెలిపారు.మూతపడుతున్న రెస్టారెంట్లు!మరోవైపు, మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో ఎల్పీజీ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ జోరుగా జరుగుతుందని పోలీసులకు నివాసితులు ఫిర్యాదు చేస్తున్నారు. అలాగే రాష్ట్రంలోని అనేక రెస్టారెంట్లు ఆదివారం వరకు మూసివేయాలని నిర్ణయించాయి. ఎందుకంటే వారి వద్ద 30 శాతమే గ్యాస్ స్టాక్ ఉంది. అమరావతి జిల్లాలో అనేక హోటళ్ల యజమానులు తమ మెనూను గణనీయంగా తగ్గించాలని నిర్ణయించుకున్నారు.పెళ్లిళ్లపై ప్రభావంఎల్పీజీ కొరత ప్రభావం వివాహాలపై కూడా పడింది. గ్యాస్ కొరత ఏర్పడితే తాము గతంలో తీసుకున్న పెళ్లి క్యాటరింగ్ ఆర్డర్లను రద్దు చేసుకోవాల్సి వస్తుందని హోటళ్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు. పింప్రి-చించ్వాడ్‌లో గ్యాస్ కొరత రాబోయే రెండు నెలల్లో జరిగే 10,000 వివాహాలను ప్రభావితం చేయనుంది. ఎందుకంటే ఏప్రిల్, మే నెలల్లో 30 శుభ ముహూర్తాలు ఉన్నాయి. ఈ కాలంలో అక్కడ సుమారు 10,000-12,000 వివాహాలు జరుగుతాయని అంచనా. అలాగే గ్యాస్ కొరత కారణంగా కొంతమంది క్యాటరర్లు ఇప్పటికే భోజనం ధరకు పెంచేశారు. ప్లేట్‌కు 10-20 శాతం ఎక్కువ వసూలు చేయడం ప్రారంభించారు. ఇది ఆటోమేటిక్‌గా పెళ్లి ఖర్చులను పెంచేస్తుంది. దీంతో పెళ్లిళ్లు చేసే మధ్యతరగతి ప్రజానీకం ఆందోళన చెందుతోంది.



# రాష్ట్రంలో మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ పలు చర్యలు చేపట్టింది

## జాతీయ మహిళా కమిషన్ ఛైర్మన్ విజయ రహత్కర్.



**మల్కాజిగిరి కమిషనరేట్ , క్రైమ్ బ్యూరో, మార్చి 12 (పీపుల్స్ న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ పలు చర్యలు చేపట్టిందని జాతీయ మహిళా కమిషన్ ఛైర్మన్ విజయ రహత్కర్ అన్నారు. గురువారం మల్కాజిగిరి పోలీస్ కమీషనర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మహిళా జన్ సున్వాయ్ కార్యక్రమానికి జాతీయ మహిళా కమిషన్ ఛైర్మన్ విజయ రహత్కర్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ కార్యక్రమానికి డిజిపి శివధర్ రెడ్డి, అడిషనల్ డిజిపి చారుసిన్హా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, మల్కాజిగిరి సిపి అవినాష్ మహంతి, ఫ్యూచర్ సిటి కమీషనర్ సుధీర్ బాబు, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ జాతీయ మహిళా కమిషన్ , స్థానిక యంత్రాంగం కలిసి పనిచేస్తే, మహిళల సమస్యలకు ఖచ్చితంగా త్వరగా న్యాయం జరుగుతుందన్నారు. జాతీయ మహిళా కమిషన్ ద్వారా జరుగుతున్న ఈ 'మహిళా జన్ సున్వాయ్' (ప్రజా విచారణ) కార్యక్రమానికి మల్కాజిగిరి, హైదరాబాద్ యంత్రాంగం అంతా ముందుకు వచ్చి సహాకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. దేశం నలుమూలల నుండి మాకు ఎన్నో ఫిర్యాదులు అందుతుంటాయని, కానీ చాలా మంది మహిళలు ఢిల్లీ వరకు రాలేరని, అందుకే మేమే వారి వద్దకు వెళ్లాలని నిర్ణయించుకొని 'జాతీయ మహిళా కమిషన్ మీ చెంతకు' అనే ఈ కార్యక్రమం ప్రారంభించి ఇప్పటివరకు మేము దాదాపు 100 జన సున్వాయ్ కార్యక్రమాలను పూర్తి చేశామన్నారు. మార్చి 8, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, మేము ఒకేసారి దేశవ్యాప్తంగా సుమారు 500 జిల్లాల్లో ఈ విచారణలు నిర్వహించాలని నిర్ణయింకొని, దీని ద్వారా సుమారు 15 నుండి 20 వేల కేసులను పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.జాతీయ మహిళా కమీషన్ కు దేశ నలుమూలల నుండి ఎన్నో ఫిర్యాదులు అందుతాయని, వారందరు ఢిల్లీ వరకు రాలేరని, ఈ మహిళ జన్ సున్వాయ్ కార్యక్రమం ద్వారా మహిళల సమస్యలను పరిష్కరించడానికి జాతీయ మహిళా కమీషన్ మీ చెంతకే వచ్చిందన్నారు. ఇక్కడ కూడా చాలా మంది మహిళలకు న్యాయం జరుగుతుందని, వారు సంతోషంగా ఇంటికి వెళ్తారని ఆశిస్తున్నానన్నారు. మల్కాజిగిరి సిపి ఆఫీస్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 30 కేసుల హియరింగ్ జరిగిందని, అతి త్వరగా పరిశీలించి పరిష్కరిస్తామని, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఆర్డిఓ శ్యాంప్రకాష్, మల్కాజిగిరి ఎంఆర్ఓ సీతారాం, డిడబ్ల్యూఓ శారద, డిఆర్డిఓ సాంబశివరావు, డిఎం అండ్ హెచ్ఓ ఉమాగౌరి, జిల్లా మైనారిటి అధికారి కాంతమ్మ, జిల్లా హౌజింగ్ అధికారి రమణమూర్తి, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# 'ఫరూఖ్ అబ్దుల్లాను 20 ఏళ్లుగా చంపాలనుకుంటున్నా'



**జమ్ముకశ్మీర్ :** మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా () పై బుధవారం హత్యాయత్నం జరిగింది. ఆయన ఓ పెళ్లి వేడుకలో పాల్గొని, వేదిక నుంచి తిరిగి వస్తుండగా ఓ దుండుగుడు ఆయనపై పాయింట్ బ్లాంక్ రేంజ్ నుంచి కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. కానీ వెంటనే సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై పక్కకు లాగడంతో బుల్లెట్ గురితప్పింది. తాను 20 ఏళ్లుగా ఫరూఖ్ అబ్దుల్లాను హత్య చేయాలనుకుంటున్నానని పోలీసుల దర్యాప్తులో దుండగుడు వెల్లడించడం గమనార్హం.ఘటనా స్థలంలోనే దుండగుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతడు జమ్ములోని పురాని మండి ప్రాంతానికి చెందిన 63 ఏళ్ల కమల్ సింగ్ జమ్వాల్‌గా గుర్తించారు. పోలీసుల దర్యాప్తు సందర్భంగా నిందితుడు.. తాను 20 ఏళ్లుగా ఫరూఖ్ అబ్దుల్లాను చంపాలని చూస్తున్నానని చెప్పినట్లు వెల్లడించారు.'నేను ఫరూఖ అబ్దుల్లాను చంపాలని 20 ఏళ్లుగా చూస్తున్నా. ఇప్పుడు నాకు ఆ అవకాశం దొరికంది. కానీ అతడు చావలేదు. అతడు బతికిపోయాడు' అని పోలీసులు దర్యాప్తులో నిందితుడు చెప్పాడు. ఎందుకు చంపాలనుకుంటున్నావని ప్రశ్నించగా నా వ్యక్తిగత కారణం ఉందని అన్నాడు. పిస్టల్ ఎవరిది అని ప్రశ్నించగా తనదే అని పేర్కొన్నాడు.బుధవారం పెళ్లికి హాజరైన ఫరూఖ్ అబ్దుల్లా.. జమ్ముకశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురిందర్ చౌధరి, ముఖ్యమంత్రి సలహాదారు నజీర్ అస్లాం వాని, ఇతర నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులతో కలిసి వేదిక నుంచి తిరిగి వస్తుండగా కమల్ సింగ్ హత్యాయత్నం చేశాడు. ఫరూక్ అబ్దుల్లా మెడపై పిస్తోల్ గురిపెట్టాడు. వెంటనే అప్రమత్తమైన సెక్యూరిటీ అతడిని లాగేయడంతో బుల్లెట్ గురితప్పింది.

# ఆ ముగ్గురినీ పక్కన పెట్టండి.. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తక వివాదంపై సుప్రీం కోర్టు




**న్యూ ఢిల్లీ :** జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ మండలి( ఎన్‌సీఈఆర్‌టీ) 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తకంలో 'న్యాయ వ్యవస్థలో అవినీతి' పాఠ్యాంశాన్ని చేర్చేందుకు కారకులైన వారిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ముగ్గురు నిపుణులతో ఇకపై ఎలాంటి సంబంధాలు కొనసాగించొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. న్యాయ వ్యవస్థలో నెలకొన్న అవినీతి గురించి వివాదాస్పద అంశంగా పాఠ్యపుస్తకంలో చేర్చడంపై ఎన్‌సీఈఆర్‌టీ.. సర్వోన్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పడంతో పాటు ఆ పుస్తకాన్ని ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే.

# పవర్‌ఫుల్ కషాయం మావ.. ఉదయాన్నే తాగితే ఆ సమస్యలన్నీ మటుమాయమే..



జామ చెట్టు భారతీయ సంస్కృతిలో ఒక అమృత ఫలంగా ప్రసిద్ధి చెందింది. దీనిని సంస్కృతంలో అమృత ఫలం అని కూడా పిలుస్తారు. జామ మొక్క ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. కేవలం పండ్లు మాత్రమే కాకుండా, దీని ఆకులు, బెరడు, వేర్లు కూడా ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. జామను బొటానికల్‌గా సిడియం గ్వాజావా అని అంటారు. ఇది మెర్టేసి కుటుంబానికి చెందిన వృక్షం. జామ ఆకుల్లోని యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి, పొటాషియం వంటి పోషకాలతో నిండిన సహజ ఔషధం ఎన్నో సమస్యలకు దివ్యౌషధంలా పనిచేస్తాయి. ఇవి మధుమేహాన్ని నియంత్రించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, అతిసారం (డయేరియా) తగ్గించడంలో, కొలెస్ట్రాల్ తగ్గించి గుండె ఆరోగ్యాన్ని పెంపొందించడంలో.. రోగనిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తాయని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు..జామ -- ఆరోగ్యానికి చిరునామా అని చెప్పొచ్చంటున్నారు. జామ చెట్లు భారతదేశంలో ముఖ్యంగా ఉష్ణమండల, ఉప ఉష్ణమండల ప్రాంతాలలో పెరుగుతాయి. ఇప్పుడు.. అన్ని ప్రాంతాల్లోనూ ఏడాది పొడువునా తక్కువ ధరకే లభిస్తున్నాయి.. జామ పండ్లతోపాటు.. ఆకులను కూడా ఉపయోగించి.. ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు..ముఖ్యంగా జామ ఆకులు విరేచనాలు, దంత నొప్పులు వంటి సమస్యలకు అద్భుతమైన నివారణిగా పనిచేస్తాయి. ఆయుర్వేదం ప్రకారం, జామ ఆకులు శోధనివారణిగా, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలతో పేగులోని ఇన్ఫెక్షన్లను తగ్గించి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. విరేచనాలను తగ్గించేందుకు ఒక పిడికెడు జామ ఆకులను 100 మిల్లీలీటర్ల నీటిలో వేసి 25 మిల్లీలీటర్ల వరకు మరిగించి కషాయం చేసుకుని తాగవచ్చు.దంత నొప్పికి కొన్ని జామ ఆకులను నమిలి, ఆ పేస్ట్‌ను నొప్పి ఉన్న పంటిపై ఉంచడం ద్వారా ఉపశమనం పొందవచ్చు. జామ ఆకుల్లోని యాంటీ ప్లేక్ గుణాలు నోటి ఆరోగ్యానికి తోడ్పడతాయి.జామ ఆకులకి యాంటీ ప్లేక్ లక్షణాలు.. ఇది నోట్లో ఉండే హానికరమైన బ్యాక్టీరియాను నాశనం చేసి, దంతాల మీద పేరుకుపోయే ప్లేక్‌ను తగ్గిస్తుంది. దీనితో దంత నొప్పి, నోటి సంబంధిత సమస్యలు తగ్గుతాయి.జామాకుల కాషాయం.. మధుమేహంలో మంచిగా పనిచేస్తుంది. షుగర్ ను కంట్రోల్ ఉంచుతుంది. అంతేకాకుండా.. కొలెస్ట్రాల్ తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో.. రోగనిరోధక శక్తిని పెంచడంలో పనిచేస్తుంది.ఈ అద్భుమైన జామ మొక్క, ఆకులను మనం ఉపయోగించుకుని ప్రయోజనాలను పొందవచ్చని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు.. దీనికోసం ఉదయాన్నే పరగడుపున ఆకుల కాషాయాన్ని తీసుకోవడం మంచిదని పేర్కొంటున్నారు.అయితే.. ఏమైనా సమస్యలతో బాధపడుతుంటే.. జామాకుల కాషాయం ఉపయోగించే ముందు వైద్య నిపుణులను సంప్రదించండి..

# ఇంట్లో ఈ ఐదు జంతువుల చిత్రాలు ఉంటే.. మీ జీవితంలో డబ్బుకు లోటే ఉండదు..!




వాస్తు శాస్త్రం ఇంటి నిర్మాణం, గది అమరికలు మాత్రమే కాకుండా ఇంట్లో ఏర్పడే వాస్తు దోషాలు, వాటి ప్రభావాలు, పరిష్కారాల గురించి కూడా మార్గదర్శకత్వం ఇస్తుంది. వాస్తు ప్రకారం ఇంట్లో దోషాలు ఏర్పడితే ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం, కుటుంబ కలహాలు, మానసిక ఆందోళనలు వంటి సమస్యలు తలెత్తవచ్చని చెబుతారు. అయితే సరైన మార్పులు, ప్రతీకాత్మక వస్తువులు లేదా విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా సానుకూల శక్తిని పెంచవచ్చని నమ్మకం. వాస్తు శాస్త్రం ప్రకారం కొన్ని జంతువులు, పక్షులు పవిత్రతకు, శుభానికి ప్రతీకలుగా భావించబడతాయి. వీటి ఉనికి లేదా వాటి విగ్రహాలు ఇంట్లో ఉంచడం వల్ల ప్రతికూల శక్తి తగ్గి, సానుకూల శక్తి పెరుగుతుందని విశ్వసిస్తారు. నేరుగా జంతువులను పెంచలేని పరిస్థితుల్లో, వాటి చిత్రాలు లేదా విగ్రహాలను ఉంచడం ద్వారా కూడా శుభఫలితాలు పొందవచ్చని వాస్తు సూచిస్తుంది. ఇప్పుడు అలాంటి కొన్ని జంతువుల ప్రాముఖ్యతను ం (చేపలు)ఇంట్లో అక్వేరియం లేదా చేపల చిత్రం ఉంచడం ఆర్థిక శ్రేయస్సుకు చిహ్నంగా భావిస్తారు. తరచుగా డబ్బు సమస్యలు, వ్యాపార నష్టాలు ఎదురైతే, ఇంటి ఉత్తర లేదా ఈశాన్య దిశలో అక్వేరియం ఉంచడం శుభప్రదమని చెబుతారు. ఇది ఆర్థిక ప్రవాహాన్ని మెరుగుపరుస్తుందని నమ్మకం.ఆవుహిందూ సంప్రదాయంలో ఆవు పవిత్రమైన జంతువు. ఆవు సేవ చేసే ఇంట్లో ఎప్పుడూ ధనలాభం, శాంతి ఉంటాయని చెబుతారు. ఆవును పెంచలేని వారు ఇంట్లో ఆవు, దూడ విగ్రహాన్ని ఉంచితే అది మరింత శుభప్రదమని భావిస్తారు.గుర్రంగుర్రం శక్తి, ఉత్సాహం, విజయానికి ప్రతీక. ఇంట్లో ఎవరికైనా తరచుగా అనారోగ్యం ఉంటే, గుర్రపు బొమ్మ లేదా పరుగు తీస్తున్న గుర్రాల చిత్రం ఉంచడం ఆరోగ్యానికి, ఉత్సాహానికి అనుకూలమని వాస్తు సూచిస్తుంది.ఒంటెఒంటె సహనం, స్థిరత్వానికి చిహ్నం. జీవితంలో సమస్యలకు పరిష్కారం కనిపించకపోతే లేదా సరైన నిర్ణయం తీసుకోలేకపోతే, ఇంట్లో ఒంటె చిత్రం ఉంచడం మానసిక స్థిరత్వం, స్పష్టతను ఇస్తుందని చెబుతారు.ఏనుగుఏనుగు బలం, ఐశ్వర్యం, రక్షణకు ప్రతీక. ఇంటి ప్రవేశద్వారం వద్ద ఏనుగు విగ్రహం ఉంచడం వల్ల ఆర్థిక లాభాలు కలగడమే కాకుండా చెడు శక్తులు దూరమవుతాయని నమ్మకం. ముఖ్యంగా జంట ఏనుగుల విగ్రహం శుభప్రదమని భావిస్తారు.ఇలా వాస్తు శాస్త్రం ప్రకారం ఈ జంతువుల ప్రతీకలు ఇంట్లో ఉంచడం ద్వారా సానుకూల వాతావరణం ఏర్పడుతుందని విశ్వసిస్తారు. అయితే ఇవి ఆధ్యాత్మిక విశ్వాసాలపై ఆధారపడి ఉంటాయి. మన ఇంట్లో శుభ వాతావరణం కోసం శుభ్రత, క్రమబద్ధత, ప్రేమ, సానుకూల ఆలోచనలు కూడా అంతే ముఖ్యమైనవని గుర్తుంచుకోవాలి. ఈ వార్తలోని సమాచారం జ్యోతిష్య శాస్త్రం, మత విశ్వాసాలపై ఆధారపడి ఉంది. పాఠకుల ఆసక్తి మేరకు అందించడం జరిగింది. దీనిని టీవీ9 తెలుగు ధృవీకరించదు

# గ్రీన్ హైడ్రోజన్ రంగంలో రాబోయే ఐదేళ్లలో 6 లక్షల ఉద్యోగాలు - కోర్సులు ఇవే



ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అన్వేషణ నూతన రంగాలనూ, సరికొత్త కెరియర్లను సైతం సృష్టిస్తోంది. అందులో గ్రీన్ హైడ్రోజన్(హరిత ఇంధనం) ఎనర్జీ ఒకటి. మరో ఐదేళ్లలో ఈ రంగంలో భారీ సంఖ్యంలో 6 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. కొన్ని బ్రాంచీల్లో ఇంజినీరింగ్, డిప్లొమా, ఐటీఐ చదువు పూర్తి చేసిన అభ్యర్థులు ఇందులో రాణించగలిగే అవకాశం ఉంది.ఎలాంటి ఉద్యోగాలు : భారత దేశంలో ఇప్పటికీ కూడా హైడ్రోజన్ ఎనర్జి రంగం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. అందువల్ల పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ)కి చాలా అద్భుతమైన అవకాశాలున్నాయి. టెక్నాలజీ కోర్సులతో పాటు రిసెర్చ్?పై ఆసక్తి ఉన్న యువతను ఈ రంగంలోని సంస్థలు ప్రోత్సహిస్తున్నాయి. హైడ్రోజన్ ఎనర్జి ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాలు మాత్రం ఉత్పత్తి చేయడానికి అధిక వ్యయం. అందువల్ల దీన్ని వినియోగించడానికి చాలా మంది వెనకాడుతున్నారు. పెద్ద సంస్థలు ఒక పక్క హైడ్రోజన్ ఎనర్జిని ప్రోడక్షన్ చేస్తున్నా ఉత్పత్తి వ్యయం తగ్గించేందుకు రకరకాల పరిశోధనలపై దృష్టి పెట్టాయి. ఎలక్ట్రాలసిస్ ప్రక్రియను సులభతరం చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నాయి. ఈ తరహా పరిశోధనలపై ఆసక్తి ఉన్నవారు ఇందులో ఉన్నత స్థాయిలో రాణించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.ఇంజినీరింగ్, టెక్నికల్ విద్యార్హతలు ఉన్నవారు హైడ్రోజన్ ప్రొడక్షన్ ఇంజినీర్లు, సేఫ్టీ ఇంజినీర్, ప్రాజెక్ట్ మేనేజర్, రెన్యువబుల్ ఎనర్జి కన్సల్టెంట్స్, ఎలక్ట్రోలైజర్ స్పెషలిస్ట్, ప్రాసెస్ ఇంజినీర్, బిజినెస్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టుగా స్థిరపడొచ్చు. ఉత్పత్తి పరంగా కార్యకలాపాల్లో నిర్వహణ సిబ్బంది, రవాణా ఏర్పాట్ల పర్యవేక్షణకు పెద్ద సంఖ్యలో మ్యాన్?పవర్? అవసరం పడనుంది.
ఏ కోర్సులు చేస్తే మేలు? : కెమికల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్‌లో సబ్జెక్టు పరంగా బలంగా ఉన్నవారికి వేర్వేరు డిపార్ట్?మెంట్?లలో అవకాశం కల్పిస్తున్నారు. ప్రాథమికంగా ఈ బ్రాంచీల్లో ఇంజినీరింగ్ చేసి హైడ్రోజన్ ఎనర్జి రంగంలోకి ప్రవేశించేందుకు అదనపు అర్హతలను కూడా కావాలనుకుంటున్న వారికి సర్టిఫికెట్, పీజీ డిప్లొమా కోర్సులు వివిధ ప్లాట్?ఫాంలలో అందుబాటులో ఉన్నాయి.ఐఐటీ ముంబయి : హైడ్రోజన్ ఎనర్జీలో కీలకమైన ఉత్పత్తి, రవాణా, భద్రత, నిల్వ, అనే నాలుగు విభాగాలపై అవగాహన కల్పించేలా నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హ్యాన్స్‌మెంట్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్) ఆధ్వర్యంలో స్వయం వేదికగా ఐఐటీ ముంబయి సంస్థ ఆన్‌లైన్ కోర్సును తెచ్చింది మరికొన్ని ఐఐటీల్లోనూ ఈ తరహా కోర్సులు చేసే అవకాశం ఉంది.
ఐఐటీ చెన్నై : పెట్రోలియం ఇంజినీరింగ్ అండ్ హైడ్రోజన్ ఎనర్జీలో పీజీ డిప్లొమా కోర్సును ఐఐటీ చెన్నై అందిస్తోంది.
కావాల్సిన నైపుణ్యాలు : గ్రీన్ హైడ్రోజన్ ఎనర్జి రంగంలో మంచి అవకాశాలను అందుకోవాలంటే ఎలక్ట్రాలసిస్ ప్రక్రియ సహా కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో ఏదైనా ఒకదానిలో మంచి పట్టు ఉండాలి. దీనితో పాటు సాలిడ్ ఆక్సైడ్ ఎలక్ట్రోలైజర్ సెల్ టెక్నాలజీ, ప్రోటాన్ ఎక్స్ఛేంజ్ మెంబరెన్స్, ఆల్కలైన్ నేర్చుకోవాలి.
హైడ్రోజన్ కంప్రెషన్, నిల్వ, రవాణా,హైడ్రోజన్ ఎనర్జిని ప్రోడక్షన్ చేస్తున్నా ఉత్పత్తి వ్యయం తగ్గించేందుకు రకరకాల పరిశోధనలపై దృష్టి పెట్టాయి. ఎలక్ట్రాలసిస్ ప్రక్రియను సులభతరం చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నాయి. ఈ తరహా ఇంధన సెల్ టెక్నాలజీపై స్కిల్స్ కావాలి.హైడ్రోజన్ ప్లాంట్లు, పైప్ లైన్లు, రీఫ్యూయలింగ్ స్టేషన్లను డిజైనింగ్ చేయగల కెపాసిటీ పెంచుకోవాలి.
హైడ్రోజన్ లీకేజీని నివారించేందుకు మెటీరియల్ సైన్సెస్‌పై అడ్వాన్స్?గా అవగాహన ఉండాలి.క్యాడ్ (సీఏడీ) వినియోగం సిమ్యులేషన్ టూల్స్, ప్రాసెస్ ఆటోమేషన్ టెక్నాలజీ నేర్చుకుని ఉండాలి.
"ప్రభుత్వం గ్రీన్ హైడ్రోజన్ ఎనర్జి రంగంపై దశలవారీగా మరో ఐదేళ్లలో భారీ ఎత్తున 8 లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోంది. 2030 నాటికి ఏడాదికి 50 లు. టెక్నాలజీ కోర్సులతో పాటు రిసెర్చ్?పై ఆసక్తి ఉన్న యువతను ఈ రంగంలోని సంస్థలు ప్రోత్సహిస్తున్నాయి. హైడ్రోజన్ ఎనర్జి ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాలు మాత్రం ఉత్పత్తి చేయడానికి అధిక వ్యయం. అందువల్ల దీన్ని వినియోగించడానికి చాలా మంది వెనకాడుతున్నారు. పెద్ద సంస్థలు ఒక పక్క హైడ్రోజన్ ఎనర్జిని ప్రోడక్షన్ చేస్తున్నా ఉత్పత్తి వ్యయం తగ్గించేందుకు రకరకాల పరిశోధనలపై దృష్టి పెట్టాయి. ఎలక్ట్రాలసిస్ ప్రక్రియను సులభతరం చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నాయి. ఈ తరహా పరిశోధనలపై ఆసక్తి ఉన్నవారు ఇందులో ఉన్నత స్థాయిలో రాణించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.ఇంజినీరింగ్, టెక్నికల్ విద్యార్హతలు ఉన్నవారు హైడ్రోజన్ ప్రొడక్షన్ ఇంజినీర్లు, సేఫ్టీ ఇంజినీర్, ప్రాజెక్ట్ మేనేజర్, రెన్యువబుల్ ఎనర్జి కన్సల్టెంట్స్, ఎలక్ట్రోక్షల మెట్రిక్ టన్నుల హైడ్రోజన్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నందున దాదాపు ఊహించని స్థాయిలో 6 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. శిలాజ ఇంధనానికి ప్రత్యామ్నాయంగా హైడ్రోజన్ ఎనర్జీకి క్రమాంగా డిమాండ్ పెరుగుతోంది. అందువల్ల ఈ రంగంలోకి ప్రవేశించే యువత భవిష్యత్తుకు ఆర్థిక మాంద్యాలు ఏ మాత్రం అడ్డురావు" -యస్.వి. సురేష్, సంపాదకులు, ఉద్యోగ సోపానం

# తీర్థయాత్రలు వయసు మళ్లిన వారే చేయాలా అసలు పురాణాలు చెప్పే నిజం ఏంటి?



హిందూ సంప్రదాయంలో పూజలకు, వ్రతాలకు ఎంత గొప్ప స్థానం ఉందో తీర్థయాత్రలకు కూడా అంతే గొప్ప స్థానముంది. తీర్థయాత్రల వల్ల పుణ్యం, పురుషార్థం దక్కుతాయి. ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జనకు తీర్థయాత్రలు చేయాలని పురాణాలు చెబుతున్నాయి. పురాణ పురుషులెందరో తీర్థయాత్రల వలన ముక్తి పొందారని తెలుస్తోంది. ఈ సందర్భంగా తీర్థయాత్రలు ఎందుకు చేయాలి? తీర్థయాత్రలు వయసు మళ్లిన వారే చేయాలా? అనే ఆసక్తికరమైన విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

### తీర్థయాత్రలు ఎవరు చేయాలి?

సాధారణంగా క్షేత్ర దర్శనం అనేది వయసుమళ్లిన వాళ్లు మాత్రమే చేయాలని అనుకుంటూ ఉంటారు. నిజానికి పుణ్య తీర్థాలు వయసులో ఉండగానే దర్శించాలి. ఆ జ్ఞాపకాలు పంచే అనుభూతిని వయసుమళ్లిన తరువాత అనుభవించాలి. వయసు మళ్లిన తరువాత కావాల్సినంత సమయం ఉంటుంది కానీ శరీరం సహకరించకపోవచ్చు. ఒంట్లో సత్తువ ఉన్నప్పుడు దివ్య క్షేత్రాలు దర్శిస్తూ పుణ్యం సంపాదించుకోవాలి.

### తీర్థయాత్రలు ఆవశ్యకత

సర్వాంతర్యామి అయిన భగవంతుని వెదుక్కుంటూ అంతంత దూరాలు వెళ్లడం అవసరమా? అనుకునేవారు లేకపోలేదు. దేవుడు అడుగడుగునా వున్నాడు నిజమే కానీ పుణ్య క్షేత్రాలకు స్థల మహాత్మ్యం ఉంటుంది. దేవతలు, ఋషులు, మహా పురుషుల పాద ధూళితో ఆ ప్రదేశాలు మరింత పవిత్రమమై ఉంటాయి. అక్కడి నీరు ఎన్నో ఔషధ గుణాలు సంతరించుకుని ఉంటుంది. అందుకే పుణ్యక్షేత్రాల సందర్శనకు భారతీయ సంప్రదాయం పెద్ద పీట వేసింది.

### పురాణ పురుషులు చేసిన తీర్థయాత్రలు

వనవాసం సమయంలో పాండవులు శ్రీకృష్ణుని ఆదేశం మేరకు అనేక పుణ్యక్షేత్రాలు సందర్శించినట్లుగా మహా భారతంలో వివరించి ఉంది. అలాగే పరశురాముడు, ఇతర పురాణ పురుషులు, మహర్షులు ఎందరో తీర్థయాత్రలు చేసి ముక్తిని పొందినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. అలాగే శ్రీరాముడు కూడా రావణ సంహారం తరువాత బ్రహ్మహత్యా దోషం పోగొట్టుకోవడానికి అనేక తీర్థయాత్రలు చేసినట్లుగా తెలుస్తోంది. సాక్షాత్తు పరమశివుడే బ్రహ్మ శిరస్సు ఖండించిన పాపాన్ని పోగొట్టుకోవడానికి బ్రహ్మ కపాలం చేత ధరించి అనేక పుణ్యక్షేత్రాలు దర్శించినట్లుగా శివపురాణంలో వివరించి ఉంది. మహాభారతంలో కురుక్షేత్ర యుద్ధానికి ముందు బలరాముడు కూడా తీర్థయాత్రలకు వెళ్లినట్లుగా వివరించి ఉంది.

### చరిత్ర చెప్పిన సత్యం

ఇలా మన పురాణాలు, ఇతిహాసాల్లో తీర్థయాత్రలు చేస్తూ మోక్షాన్ని పొందిన వారు అనేకమంది కనిపిస్తారు. రామాయణంలో అంధులైన తన తల్లిదండ్రులను కావడిలో మోసుకుని వెళ్తూ తీర్థయాత్రలు చేయించిన శ్రవణ కుమారుని కథ మనందరికీ తెలిసిందే! అలాగే మనుచరిత్రలో సిద్ధుడు తీర్థయాత్రలు చేసి కేదారేశుని, హింగులాంబిక దేవిని దర్శించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఇలా తీర్థయాత్రలతో ముక్తి పొందిన వారి గురించి మన పురాణేతిహాసాలు వివరిస్తున్నాయి.

### పుణ్యం - పురుషార్థం

ఆధ్యాత్మిక చింతన పెంచే తీర్థయాత్రలు పుణ్యపురుషార్థాల సాధనకు సోపానాలు. యాత్రల ద్వారా పుణ్యం లభిస్తుందన్న విషయం తెలిసిందే! అయితే పురుషార్థం అంటే ఏమిటి? వివిధ ప్రాంతాలను సందర్శించడం ద్వారా ఆయా ప్రాంతాల ప్రజల జీవన విధానాలు, ఆ ప్రాంతాల సామాజిక ఆర్థిక పరిస్థితులపై అవగాహన కలుగుతుంది. అంతేకాదు తీర్థయాత్రలు చేసే సమయంలో ఇతర యాత్రికులతో కలిసిమెలిసి ఉండడం వలన సామాజిక సంబంధాలు కూడా మెరుగు పడతాయి. దీనినే పురుషార్థం అంటారు.

### పఠనం, శ్రవణం కూడా మోక్ష కారకము!

తీర్థక్షేత్రాలను దర్శించడం మాత్రమే కాదు వాటి గురించిన విశేషాలు చదవడం, ఇతరులకు ఆ వివరాలు వివరించి చెప్పడం, ఇతరుల ద్వారా క్షేత్ర మహత్యాన్ని వినడం వంటివి కూడా మోక్ష కారకలే అని శాస్త్రం చెబుతోంది.

### దర్శనీయ స్థలాలు

ఇక మన దేశంలో తీర్థయాత్రలు గా భావించే పుణ్య ప్రదేశాలు అనేకం ఉన్నాయి. అలాంటి దర్శనీయ స్థలాల్లో ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలు, పంచారామాలు, చార్ ధామ్, పంచభూత క్షేత్రాలు మొదలైనవి ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా హిందువుగా జన్మించిన ప్రతి ఒక్కరు సప్త మోక్ష ధామాలుగా ప్రసిద్ధి చెందిన అయోధ్య, మథుర, కంచి, మాయ, అవంతి, కాశీ, ద్వారకా అనే సప్త మోక్ష క్షేత్రాలను తప్పకుండా దర్శించాలని అంటారు.

### తీర్థయాత్రల్లో ఎలా మెలగాలి?

పుణ్యం కోసం చేసే తీర్థయాత్రలలో ఎలా నడుచుకోవాలో మన ధర్మశాస్త్రం చెప్పింది. తీర్థయాత్రలు చేసే సమయంలో అసూయ, ద్వేషం, అసత్యం అనే దుర్గుణాలను విడిచి పెట్టాలి. శక్తికొద్దీ దానధర్మాలు లభిస్తాయి. అదే ముక్తిమార్గం.

### శుభం భూయాత్!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# ధాన్యం ఎగుమతి,దిగుమతులను సమీక్షించాలి !

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలతో ఎగుమతులు, దిగుమతులు ఆగిపోయాయి. ఓ రకంగా ఇది మనం సంక్షోభాన్ని సరిదిద్దుకునే సమయంగా భావించాలి. ఇప్పటికే ఇబ్బడిముబ్బడిగా ధాన్యాలు దిగుమతి చేసుకుంటున్నా భారత్ ఈ దశలో వీటిపై పునరాలోచన చేయాలి. దేశీయంగా పప్పు ధాన్యాలు, నూనె ధాన్యాలు విపరీతరంగా పండుతున్నా, రైతులకు కనీస మద్దతు ధరలు చెల్లించడం లేదు. అలాగే వేసిన పంటలను కొనుగోలు చేయడం లేదు. తెలంగాణలో శనగ, మక్కజొన్నలకు డిమాండ్ లేకుండా పోయింది. శనగ కొనుగోళ్లపై స్పష్టత కరవైంది. రైతులు సాగుచేసిన శనగ పంటకు మద్దతు ధర అందించడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్టత కరువైంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనగ పంటను నిల్వ ఉంచుకున్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తిరిగి చెల్లించడానికి ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని కొంతమంది రైతులు వాపోతున్నారు. ఈ దశలో దేశీయంగా ఆయా రాష్ట్రాల్లో పండుతున్న పంటలను కొనుగోలుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహార ధాన్యాలను కొనుగోలు చేసి, ప్రజలకు సరసమైన ధరల్లో అందించాలి. అదేవిధంగా దిగుమతులపై పూర్తి ఆంక్షలు విధించాలి. నూనెలు, పప్పులను దిగుమతి చేసుకోవడం తక్షణం ఆపాలి. గత కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంతానికి సంబంధించి మూడు పద్దులను అంటే రూ.60 వేల కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెట్టలేదని సమాచారం.. ఈ సంవత్సరం అందుకు భిన్నంగా జరుగుతుందని ఆశించలేం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంవత్సరం బడ్జెట్లో ధరల స్థిరీకరణ కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కేంద్రం ఎఫ్‌సిఐ ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి కొనాల్సిన కందులు, శనగలు, పెసలు, మొక్కజొన్నలు లాంటి 25 రకాల పంటలను కొనడానికి నిరాకరించింది. దేశంలోని 24 వేల స్థానిక మార్కెట్లు, 125 ప్రత్యేక మార్కెట్ల నిర్వహణను వదిలేయడం సరైనది కాదు. నిజానికి ధాన్యం సేకరణ, తిరిగి ప్రజలకు వాటిని ఆహార ధానా÷-యల రూపంలో చేరవేయడంలో పక్కా ప్రణాళిక లేకుండా పోయింది.ప్రైవేటు వ్యక్తులు కంపెనీలు, మార్కెట్లు పెట్టుకునేందుకు అనుమతించే బిల్లును గత ఫిబ్రవరిలో పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకుంది. గత రెండు సంవత్సరాలుగా వరి ధాన్యం, పత్తి, మిర్చి, పొగాకు, ఉల్లిపాయలు, కోకో లాంటి పంటలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలకు కొనేవారే లేకుండా పోయారు. తక్కువ ధరలకు రైతులు అమ్ముకోవలసి వస్తున్నది. నిజానికి వ్యవసాయ విధానం సక్రమంగా ఉంటే, అనవసరపు దుబారా ఖర్చులు తగ్గించి, దేశీయంగా పంటలను ప్రోత్సహించి, ఉన్న పంటలను కొనుగోలు చేయాలి. అలాగే ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసరాలు సరఫరా చేసే వ్యవస్థను రూపొందించాలి. దీంతో దేశంలో ఆకలి బాధతలు తగ్గడంతో పాటు, కొనుగోలు శక్తి కూడా పెరుగుతుంది. కానీ గొప్పలు చెబుతున్న బిజెపి నేతలు ఒక్కరు కూడా సమగ్ర వ్యవసాయ విధానంపై ఆలోచన చేయడం లేదు. పంటలు పండుతున్నా, సామాన్యులకు ధరలు అందడం లేదు. అలాగే ఇబ్బడి ముబ్బడిగా దిగుమతులు పెంచేస్తున్నారు. ఉన్న వ్యవసాయాన్ని నాశనం చేసే చట్టాలు చేయడం, పార్లమెంట్, అసెంబ్లీల్లో వ్యవసాయ ధరలు లేక రైతులు బాధపడుతున్నారని మొసలి కన్నీరు కార్చడం అలవాటైపోయింది. ఇకపోతే న కిలీ విత్తనాలు కూడా రైతులను నట్టేట ముంచుతున్నాయి. విత్తనాలు అమ్మిన కంపెనీలపై చర్యలు తీసుకోవడం లేదు.కంపెనీ దగ్గర కొన్న విత్తనాలు సరిగ్గా మొలవకపోయినా, తగిన దిగబడి రాకపోయినా తర్వాత వ్యవసాయ సీజన్ లోపు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని 2001 విత్తన బిల్లులో ఉంది. కానీ ఈ



తాజా బిల్లు ప్రకారం కంపెనీ విత్తనాలు రెండుసార్లు మొలవక పోయినా, సరైన దిగుబడులు రాకపోయినా ఆ రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించనవసరం లేదు. మూడవసారి ఆ కంపెనీ విత్తనాలు విఫలమైతే ఆ కంపెనీ ప్రభుత్వానికి ఫెనాల్టీ చెల్లించాలని బిల్లులో ఉంది కానీ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని లేదు. పంటల బీమా చట్టం' కార్పొరేట్ కంపెనీలకు ధీమా కల్పిస్తున్నది కానీ రైతులకు కాదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆపరేషన్ గైడ్‌లైన్స్ మాత్రం వివరంగా ఉన్నాయి. ఆచరణలో ఈ పద్దు కింద ప్రతి సంవత్సరం కేటాయించే రూ.15 వేల కోట్లలో ఐదు వేల కోట్లు కూడా రైతులకు చేరడం లేదు. రూ.10 వేల కోట్లను కార్పొరేట్ బీమా కంపెనీలు మింగేస్తున్నాయి. వాతావరణం, క్రాప్ కటింగ్ ఎక్స్‌పరిమెంటేషన్‌లో ప్రైవేట్ కంపెనీల డేటాను వాడుతున్నారు. ప్రభుత్వ వ్యవసాయ బీమా కంపెనీలు డమ్మీలుగా మిగిలిపోతున్నాయి. ప్రైవేట్ కంపెనీదే పెత్తనం, వారే దోచేస్తున్నారు.వ్యవసాయానికి సంబంధించి పురుగు మందులలో అత్యంత దోపిడి జరుగుతున్నది. 100 రూపాయల మందుని వెయ్యి రూపాయలకు, 300 రుపాయలది 3 వేలకు అమ్ముతూ వ్యాపారస్తులు అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. దీనికి కారణం 'నూతన పురుగు మందుల విధానం'లో ఎం.ఆర్.పి విధానం పాటించాలని లేకపోవడమే. పురుగులను చంపడానికి ఆ ద్రావకంలో ఎంత శాతం ముందు ఉండాలో అది ఉండక పోయినా వ్యాపారస్థులను అడిగేవారు లేరు. ఇలాంటి సమస్యలన్నీ చర్చించాలి. ఇందుకు తగిన సమయం ఇదే. సమగ్ర వ్యవసాయ విధానం, ఎగుమతులు దిగుమతులపై చర్చించాలి. దేశీయ పంటలను పండించుకుని తినేలా వ్యవస్థీకృత పద్దతిని తీసుకుని రావాలి. అప్పుడే దేశం ఆర్థికంగా బలపడుతుంది.

# గ్యాస్ కొరతతో హోటళ్లు మూత

**హాస్టళ్ల పరిస్థితి మరింత దారుణం**

**ఆర్టీసీ క్రాస్‌రోడ్ బావర్చి మూసివేత**

**ప్యారడైజ్ హోటల్ కూడా అదే దుస్థితి**

**బ్లాక్ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవన్న అధికారులు**

**హైదరాబాద్,మార్చి12:** వంటగ్యాస్ కొరత హోటల్ పరిశ్రమను అతలాకుతలం చేస్తోంది. ఇక్కడ హాస్టళ్లో ఉంటూ చదువుకుంటున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యి దుర్భర పరిస్థితి నెలకొంది. అలాగే హోటల పరిశ్రమపై ఆధారపడ్డ నిరుద్యోగులు కూడా ఆందోళన చెందుతున్నారు. మహానగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోయింది. వంటగ్యాస్ సిలిండర్ల సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనివాస్ తెలిపారు. సిలిండర్లను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశామని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. నెలకు ఒక సిలిండర్ బుకింగ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియా యుద్ధం పీజీ యజమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఓవైపు గ్యాస్ కొరతతో నగరంలోని పలు హోటళ్లను తాత్కాలికంగా మూసేస్తుంటే, మరోవైపు హాస్టళ్ల నిర్వహణపై యజమానులు మల్లగుల్లాలుపడుతున్నారు. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా బుధవారం నుంచి నగరంలో దాదాపుగా ఆగిపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారింది.గ్యాస్ వినియోగం ఎక్కువ అయ్యే దోసె, పూరీ, చపాతీ వంటకాలను తాత్కాలికంగా అన్ని హాస్టళ్లలో నిలిపివేసినట్లు సమాచారం. గ్యాస్ కొరత తీరేవరకు అన్నం, సాంబారు, కూరతో సాధారణ భోజనాన్ని మాత్రమే అందించగలమని ఐటీకారిడార్‌లోని హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ప్రకటించారు. చికెన్, కోడిగుడ్డుకూర, వేపుళ్లు వంటి అదనపు వంటలను నిలుపుదలచేస్తున్నట్లు తెలిపారు.



టీ, కాఫీ లాంటివాటిని అందించలేమని వెల్లడిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో మూడు, నాలుగు రోజులుగా సిలిండర్ల బుకింగ్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. సర్వర్ డౌన్‌తో బుకింగ్ కావడం లేదంటున్నారు. వాట్సాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉన్నా కావడం లేదంటున్నారు.ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బావర్చి హోటల్‌ను బుధవారం మూసేశారు. గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగానే మూసేసిన్నట్లుగా తెలిసింది. ప్రముఖ ప్యారడైజ్ హోటల్స్ అన్ని బ్రాంచీలలో టీ అమ్మకాలను నిలిపివేశారు. ఐటీసీ సంస్థ కూడా వివిధ ప్రాంతాల్లో గల సంస్థ హోటల్స్‌లో గ్యాస్ కొరత కారణంగా లంచ్, డిన్నర్ ఉండదని ప్రకటించింది. ఒకవేళ దొరికినా కొన్ని ప్రాంతాల్లో రూ. 4 వేలకు, మరికొన్ని ప్రాంతాల్లో రూ. 3,500కు విక్రయిస్తున్నారు. 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర సాధారణంగా రూ.2105ల వరకు ఉంది. బుధవారం నుంచి కమర్షియల్ సిలిండర్ల సరఫరా పూర్తిగా బంద్ అయింది. పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపివేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా లేకపోవడం, మార్కెట్‌లో అధిక ధర ఉండడంతో కొనుగోలు చేయలేక పలు హోటల్స్ మూత పడుతున్నాయి. సిలిండర్ కొరతతో హోటల్స్ మూసేస్తున్నట్లు యజమానులు ప్రకటించారు. అవసరమైతే అవసరమైతే కట్టెల పొయ్యి మీద వంట చేస్తామని చెప్పారు. ఇక పలు ప్రాంతాల్లో టిఫిన్ సెంటర్‌లో కమర్షియల్ సిలిండర్ సరఫరా లేకపోవడంతో హోటల్ మూసివేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టిఫిన్ సెంటర్ బందు చేసుకోవాల్సి వస్తదేమోనని ఆందోళన చెందారు. అఫ్జల్‌గంజ్, బేగంబజార్‌లో కొన్ని టిఫిన్ సెంటర్లలో గ్యాస్ లేకపోవడంతో మూసేస్తున్నారు. వేల రూపాయలు పెట్టి సిలిండర్ కొనుగోలు చేసి వ్యాపారం ఎలా చేస్తామని చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కొరతతో పలు ప్రాంతాల్లో బిర్యానీ సెంటర్లు మూతపడ్డాయి. పలు ప్రాంతాల్లో వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు దొరక్కపోవడంతో టీ షాపులు, బండి వ్యాపారులు, టిఫిన్ సెంటర్ల నిర్వహకులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారు. కొందరూ గృహ వినియోగదారులు 14కిలోల గ్యాస్ సిలిండర్‌ను రూ.1800ల వరకు అమ్ముతున్నారు. గ్యాస్ సిలిండర్ల కొరతతో హోటళ్లు మూతపడుతున్నాయి. గృహావసరాల సిలిండర్ల సరఫరా తగ్గింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే రూ.5 భోజనానికి ఇబ్బంది ఉండదని జీహెచ్ఎంసీ వర్గాలు చెబుతున్నాయి.విద్యుత్‌తో నడిచే యంత్రాలతో భోజనం తయారు చేస్తున్న దృష్ట్యా గ్యాస్ కొరత ప్రభావం తయారీపై ఉండబోదని జీహెచ్ఎంసీ అధికారి ఒకరు తెలిపారు. సిలిండర్లకు ప్రత్యామ్నాయ మర్గాలను నిర్వాహకులు అన్వేషిస్తున్నారని అమీర్‌పేట హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు చెబుతున్నారు. బుధవారం అమీర్‌పేట ప్రాంతంలోని హాస్టల్ నిర్వాహకులు 120కుపైగా ఎలక్ట్రిక్రల్ స్టౌలు కొనుగోలు చేసినట్లు సమాచారం. కొందరు కట్టెల పొయ్యి ఏర్పాటుచేసుకున్నారని దుర్గానగర్ హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ చెప్పారు. గ్యాస్ కొరత నేపథ్యంలో హాస్టళ్ల యజమానులంతా ఒక్కటయ్యారు. నిర్వహణ విషయంలో తాత్కాలిక నిబంధనలు రూపొందించి అమలుచేస్తున్నారు.విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం నగరానికి వచ్చిన యువతకు ఆశ్రయమిచ్చే పేయింగ్ గెస్ట్ హాస్టళ్ల నిర్వహణ ఇప్పుడు మరింత భారంగా మారింది. మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కోర్సులు నేర్చుకోడానికి వచ్చే విద్యార్థుల సంఖ్య ఏడాదిగా బాగా తగ్గింది. దాంతో ప్రైవేటు హాస్టళ్ల వ్యాపారం మందకొండిగా నడుస్తోంది. గ్యాస్ కొరత మమ్మల్ని మరింత నష్టాల్లోకి నెడుతుంది. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నాం. హాస్టల్‌లో ఉంటున్నవారికి అన్నం, కూర, సాంబారైనా వడ్డించడానికి ప్రత్నిస్తున్నాం అంటున్నారు.

# రైతులను బలహీనం చేసేలా చట్టాలు



**కౌలు రైతులను విస్మరిస్తున్న పాలకులు**

**వ్యవసాయరంగం మరింత సంక్షోభంలోకి నెట్టే చర్యలు**

**అమరావతి,మార్చి12:** పేద రైతు, కౌలు రైతు కేంద్రంగా ఉన్న వ్యవసాయాన్ని చట్టాల ద్వారా కార్పొరేట్లకు కట్టబెట్టడానికి మార్గం సిద్ధం చేస్తున్నారనేది స్పష్టంగా తెలుస్తుంది. వ్యవసాయ సంక్షోభం, యువరైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయేగాని తరగడం లేదు. అందుకుగల కారణాలను, పరిష్కారాలను కనిపెట్టడంలో ప్రభుత్వం వైపు నుండి వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. చంద్రబాబు నాయుడు రాష్ట్ర అసెంబ్లీలో 'డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్' పత్రాన్ని ప్రవేశ పెట్టినప్పుడు కొన్ని ముఖ్యాంశాలను ప్రస్తావించారు. స్వర్ణాంధ్ర 2047 సాధించే సమయానికి వ్యవసాయరంగంపై ఆధారపడే జనాభా 60 శాతం నుండి 10 శాతానికి పడిపోతుందని అంచనా వేస్తున్నారు. నేడున్న వ్యవసాయ భూములు కూడా 30 శాతం చాలవని అంటున్నారు.. మిగతాది అవసరం లేదన్న ధోరణి కనిపిస్తోంది. అంటే ఆ భూములను ఎవరికైనా అమ్ముకోవచ్చన్న ధోరణి కనిపిస్తోంది. వ్యవసాయ రంగంలో మిగిలిపోయే మిగతా 50 శాతం జనాభాను పట్టణాలకు తరలించి వారిని చీప్ లేబర్‌గా వాడుకోవచ్చన్న దుర్మార్గ ఆలోచన కూడా ఇందులో ఇమిడి ఉంది. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ సంవత్సరం 100 లక్షల ఎకరాలను అమ్మకానికి సిద్ధం చేసింది. నూతన నీటి విధానం' ప్రకారం కాలువలకు, పొలాలకు మీటర్లు పెట్టి నీటి వాడకాన్నిబట్టి రైతుల నుండి చార్జీలు వసూలు చేస్తారు. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి కంపెనీల నుంచి పెట్టుబడులు ఆహ్వానిస్తారు. ఈ విధానం పేద రైతులకు వ్యతిరేకమైనదిగా గుర్తించాలి. అప్పుడు సాగునీరు చాలా ఖరీదైనదిగా మారుతుంది. ఇకపోతే విత్తన బిల్లు 2025' చూస్తే రైతులకు ఆందోళన కలుగుతుంది. విద్యుత్ సవరణ చట్టం 2025' ప్రకారం మొత్తం విద్యుత్ వ్యవస్థను ప్రైవేటీకరించడం ప్రధానాంశం. ఐదు సంవత్సరాలలో క్రాస్ సబ్సిడీని రద్దు చేయాలనేది మరో కీలకాంశం. ఇది మెట్ట ప్రాంతాలలో, గిరిజన ఏరియాలో, వెనుకబడ్డ ప్రాంతాలలో చిన్న రైతుల పంపుసెట్లు, లిఫ్ట్‌ల వ్యవసాయాన్ని బాగా దెబ్బతీస్తుంది. ఎరువుల విధానం 2025' ప్రకారం ఎరువులపై ప్రభుత్వ నియంత్రణ తొలగించారు. సకాలంలో రైతులకు అందక పోయినా, ఉండాల్సిన నాణ్యత లేకపోయినా, ధర పద్ధతులలో తేడాలున్నా ప్రభుత్వ యంత్రాంగానికి బాధ్యత లేదు.

ఇప్పుడు ఈ విధానంలో అదనంగా నానో లిక్విడ్ యూరియాను ప్రవేశ పెట్టింది. దాంట్లో నత్రజని 45 శాతం నుంచి 4 శాతానికి తగ్గుతుంది. యూరియాపై ప్రభుత్వ సబ్సిడీ మొత్తం తగ్గించి నగదు బదిలీ పథకం పెట్టాలని కేంద్రం రాష్ట్రాలను కోరుతోంది. నానో యూరియా తీసుకున్న రాష్ట్రంలో బస్తాకు రూ.800 సబ్సిడీ ఇస్తానని ప్రకటించింది. ప్రకృతి విపత్తుల చట్టం 25, సెక్షన్ 12లో బాధితులను ఆదుకోవడానికి వున్న సూచనలు తొలగించారు. సెక్షన్ 13లో పంటలు కోల్పోయిన రైతులకు చెందిన రుణాలు వాయిదా వేసి తిరిగి పంట రుణాలు రీషెడ్యూల్ చేసే చాప్టర్‌ను తొలగించారు.

ఇరవై నెలల్లో ఇన్ని చట్టాలు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

# అశ్వారావుపేటలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం

**– ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ మానవహారం**

**అశ్వారావుపేట, మార్చి 12 :** పట్టణంలో మారకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు పోలీ సులు విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్య క్రమంలో భాగంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులు, యువతకు మారకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ డీఎస్పీ బుచ్చయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతున్నది ఆందోళనకరమని అన్నారు. ఒకసారి డ్రగ్స్ అలవాటు పడితే ఆ అలవాటును విడిచిపెట్టడం చాలా కష్టమవుతుందని, మొదట వినోదం లేదా ఒత్తిడి తగ్గించుకోవడం కోసం తీసుకునే డ్రగ్స్ తరువాత జీవితాన్ని పూర్తిగా నాశనం చేసే స్థాయికి తీసుకె ళ్తాయని ఆయన హెచ్చరించారు. డ్రగ్స్‌కు బానిసైన వ్యక్తి మొదట కుటుంబ సభ్యులు, స్నేహితుల నుండి దూరమ వుతాడని, తరువాత మానసికంగా, శారీరకంగా తీవ్ర నష్టాలను ఎదుర్కొంటాడని వివరించారు. అలాంటి అలవాట్లు పెరుగుతూ పోతే చదువు, ఉద్యోగం, కుటుంబ జీవితం అన్నీ దెబ్బతిం టాయని, చివరికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని దొంగతనాలు, నేరాలకు పాల్పడే పరిస్థితి ఏర్పడు తుందని ఆయన తెలిపారు. డ్రగ్స్ సేవించడం వలన వ్యక్తి విచక్షణ కోల్పోయి అనాలోచిత







చర్యలకు పాల్పడే ప్రమాదం ఉందని, కొన్నిసార్లు హత్యలు, ఆత్మహత్యలు వంటి తీవ్రమైన సంఘటనలకు కూడా దారి తీస్తున్నాయని డీఎస్పీ బుచ్చయ్య విద్యార్థులకు వివరించారు. అందుకే యువత ముందుగానే అప్రమత్తంగా ఉండి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

ఈ సందర్భంగా సబ్ ఇన్‌స్పెక్టర్ యయాతి రాజ్ మాట్లాడుతూ, కొంతమంది ధనికులు మరియు సినీ రంగానికి చెందిన వ్యక్తులు తమ ఒత్తిడిని తగ్గించుకోవడానికి స్వల్పంగా డ్రగ్స్ వినియోగించడం ప్రారంభించారని, అదే తరువాత మహమ్మారి లా మారి సమాజంలో వ్యాప్తి చెందుతోందని తెలిపారు. ఈ అల వాటు పట్టణాలకు మాత్రమే పరిమితం కాకుండా పల్లెలకు కూడా చేరుకుని కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా జాగ్రత్తగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించిన వెంటనే వారిని సరిదిద్దే ందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమా జంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు పోలీసులకు సహకరించాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమం అనంతరం ఈగల్ ఫోర్స్ అధికారులు, అశ్వారావుపేట పోలీసులు, ఎక్సైజ్ మరియు రెవెన్యూ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు, విద్యార్థులు కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వ్యతిరేక ప్లకార్డులు పట్టుకుని "డ్రగ్స్‌కు నో చెప్పండి", "యువతే దేశ భవిష్యత్తు", "డ్రగ్స్‌కు దూరంగా ఉండండి -- ఆరోగ్యంగా జీవించండి" వంటి నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది.

ర్యాలీ అనంతరం అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ కూడలి వద్ద విద్యార్థులు, అధికారులు కలిసి మానవహారం ఏర్పాటుచేసి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సం కల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ డీఎస్పీ బుచ్చయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్ యయాతి రాజ్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజలు, విద్యార్థులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పని లేకపోతే మేము ఎట్లా బతకాలి

**– ఎండాకాలంలో ఉపాధి పని లేకుండా చేయాలని చూస్తున్న మోడీ సర్కార్ మా పొట్ట కొడుతున్న ప్రభుత్వం**

**బూర్గంపాడు, మార్చి 12 :** మండల పరిధిలోని మోతే పట్టి నగర్ లో ఉపాధి పని చేస్తున్న ఉపాధి కార్మికుల్ని సందర్శించిన బూర్గంపాడు వ్యకస మండల కమిటీ ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రశీ లో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పనిని పేరు మార్చ టమే కాకుండా ఉపాధి పని పేదలకి లేకుండా చేయాలనే ఆలోచనతో పని పైన విపరీతమైన భారాలు మోపిన సర్కార్ ఆ విధంగా మీరు పని చేస్తేనే మస్టర్ ఉంటుందని ఆదేశాలు ఇవ్వటం వల్ల ఉపాధి కార్మికులు పని చేయలేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో 10% ఖర్చు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం 90 శాతం ఖర్చు పెట్టాలని చట్టాలు ఘోషిస్తున్నాయి కానీ కొత్త విబి జీ




రామోజీ పేరుతో ఉపాధి పని లేకుండా చేయాలనే దురుద్దేశంతో మోడీ సర్కార్ 40% రాష్ట్రాలపై భారం మోపారు 60 శాతమే ఇస్తామని చెబుతుంది అంతేకాదు 125 రోజులు పని కల్పిస్తున్నామని ప్రభుత్వం సంకలు కొట్టుకు ంటుంది కానీ బడ్జెట్లో నిధులు లేవు ఈ పనిని పూర్తిగా తీసేసే కుట్రతో భాగంగా ఉపాధి కార్మికులందరూ ఈ దేశంలో ఈ రాష్ట్రంలో ఏకం కావలసిన అవసరం ఉంది ఉపాధి పని గ్రా మాలలో జీవిస్తున్న వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న పనిని కూడా లేకుండా చేయాలని లేని వాటిని యాపు లు ద్వారా చాక్లెట్ ద్వారా పనిని చూపిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు . డౌన్లోడ్ కాకపోయినా ఇంటర్ నెట్ రాకపోయినా మధ్యాహ్నం రెండు గంటల దాకా ఎర్రటి ఎండలో ఉండాల్సిన అవసరం వస్తుందని చెబుతున్నారు

మీరంతా ఈ రకంగా చేస్తేనే తప్ప లేకపోతే మీకు ఏమి ఉం డదు అని చెబుతున్న అధికారులు అంతేకాదు మనిషి కనులు గుడ్లల్లో ఉన్న పొరలు క్లారిటీగా కనపడకపోతే ఆ గ్రూపు సభ్యు లందరికీ మస్టార్ ఉండదు డబ్బులు రావు ఇప్పటికే చాలా మంది కంటి చూపు సక్రమశీ లేదని పనిలో నుంచి తొల గిస్తున్నారు. ప్రజా వ్యతిరేకమైన విధానాలని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉపాధి కార్మికులతో పోరా టాలు ఉద్యమాలు చేయక తప్పదని కేంద్ర ప్రభు త్వాన్ని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో వ్యకస మం డల అధ్యక్షులు అబిదా, గుమ్మడి మంగా తుమ్మల గురు స్వా మి, బోడ నాగేశ్వరావు, తుమ్మల నాగయ్య, దుర్గ .సింధు .జ యశ్రీ ,శిరీష ,శ్రీ విజయ, సత్తుపురి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు

# టాయిలెట్‌లో ఎక్కువ సేపు కూర్చుని ఫోన్ చూస్తే అంతే..

టాయిలెట్‌లో కూర్చుని మొబైల్‌లో స్క్రోల్ చేయడం ఇప్పుడు చాలా మందికి అలవాటుగా మారిందని చెప్పవచ్చు. పెద్దలలో సుమారు 66% మంది టాయిలెట్‌లో కూర్చుని వార్తలు చూడటం లేదా సోషల్ మీడియా బ్రౌజ్ చేయడం చేస్తూ ఉంటారు. ఈ ఆధునిక అలవాటు కారణంగా చాలా మంది టాయి లెట్‌లో ఎక్కువసేపు కూర్చుంటున్నారు. ఇది వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా ఎక్కువసేపు కూర్చుని మొబైల్ ఉపయోగించడం వల్ల పెద్దప్రేగు దగ్గర ఉన్న రక్తనాళాలు ఉబ్బిపోయి పైల్స్ (హెమరాయిడ్స్) సమస్య వచ్చే అవకాశం ఉందని ఇవి అంతర్గతంగా లేదా బయట వైపు కూడా రావచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు. మన దేశంలో సుమారు 4 కోట్ల మందికి పైగా పైల్స్ సమస్యతో బాధపడుతున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 10 లక్షల కేసులు కొత్తగా గుర్తించబడుతున్నాయి. టాయిలెట్‌లో ఎక్కువ సేపు గడిపితే.. పైల్స్ సమస్యతో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుందని, టాయిలెట్ లో ఎక్కువ సమయం కూర్చోవడం



కూడా ఇందుకు ఒక కారణమని నిపుణులు చెబుతున్నారు. అసలు టాయిలెట్‌లో కూర్చుని ఎక్కువ సమయం మొబైల్ వాడటం వల్ల పైల్స్ ఎందుకు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం. ౹ాబఎశ్రీఅఎ ౹ాఅఎత్తీఖతీఎ శీట ౹ాఎఅవఅఎవ ౹ాఅవ లో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనం ప్రకారం, టాయిలెట్‌లో మొబైల్ స్క్రోల్ చేయడం వల్ల పైల్స్ వచ్చే ప్రమాదం 46% వరకు పెరుగుతుంది. దీని వల్ల నొప్పి, దురద, రక్తస్రావం కూడా రావచ్చు. హెమరాయిడ్స్ అనేవి పెద్దప్రేగు లేదా మలద్వారం వద్ద ఉన్న రక్తనాళాలు ఉబ్బిపో వడం వల్ల వస్తాయి. టాయిలెట్‌లో ఎక్కువసేపు కూర్చోవడం వల్ల మలద్వారం దగ్గర ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. దీని వల్ల అక్కడి రక్తనాళాలు విస్తరించి ఉబ్బిపోతాయి. కనెక్టివ్ టిష్యూ బలహీనపడుతుంది. మొబైల్ వాడటం వల్ల తెలియకుండా ఎక్కువ సమయం టాయిలెట్‌లో కూర్చుంటారు. దీని వల్ల మలద్వారంపై ఒత్తిడి పడి పైల్స్ వచ్చే అవకాశం పెరుగుతుంది. అంతేకాకుండా టాయిలెట్‌లో కూర్చొని మొబైల్ వాడటం వల్ల ఇతర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉంటుందని నిపుణులు తెలియజేస్తున్నారు. 5 నిమిషా లకు మించి వద్దు.. పరిశోధనల ప్రకారం సుమారు 37% మంది ఒకసారి టాయిలెట్‌కు వెళ్లినప్పుడు 5 నిమిషాల కంటే ఎక్కువసేపు కూర్చుంటారు. మొబైల్ సూచిస్తున్నారు.

# కోడిగుడ్లను ఎలా తింటే శరీరానికి అధిక మొత్తంలో పోషకాలు లభిస్తాయి.. వీటిని ఎలా తినాలి..

అత్యంత పోషకపరమైన ఆహారాల్లో గుడ్లు కూడా ఒకటి. వీటిని రోజూ వారి ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరానికి ఎంతో మేలు కలుగుతుంది. వీటిలో అనేక పోషకాలు ఉంటాయి కనుక వీటిని సంపూర్ణ ఆహారంగా చెప్పవచ్చు. గుడ్లు కంప్లీట్ ప్రోటీన్ గా పరిగణించబడతాయి. శరీరం స్వయంగా తయారు చేసుకోలేని తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు గుడ్డులో ఉంటాయి. కండరాల పునరుద్ధరణలో, పెరుగుదలలో, శరీర పనితీరుకు ఇవి ఎంతో సహాయపడతాయి. వీటితో పాటు గుడ్డులో విటమిన్ బి12, విటమిన్ డి, సెలీనియం, కొలిన్ వంటి ముఖ్యమైన పోషకాలు కూడా ఉంటాయి. బరువును నియంత్రించడంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, కంటి ఆరోగ్యాన్ని కాపాడడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. గుడ్డును వివిధ రూపాల్లో వండుకుని తీసుకుంటూ ఉంటారు. అయితే గుడ్లను వండే విధానం వాటి పోషక విలువలపై ప్రభావం చూపిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉడకబెట్టి లేదా పోచింగ్ చేసి..గుడ్లను కొందరు పచ్చిగా తీసుకుంటారు. అయితే ఇలా తీసుకోవడానికి బదులుగా గుడ్లను వండి తీసుకోవడం వల్ల వీటిలో ఉండే ప్రోటీన్ సులభంగా జీర్ణమవుతుంది. అలాగే గుడ్డులో ఉండే బయోటిన్ అనే విటమిన్ ను శరీరం సులభంగా ఉపయోగించుకోగలుగుతుంది. గుడ్లను తక్కువ సమయం తక్కువ ఉష్ణోగ్రత మీద ఉడికించి తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే గుడ్లను ఉడకబెట్టడం లేదా పోచింగ్ చేయడం అత్యంత ఆరోగ్యకరమైన



పద్దతుల్లో ఒకటి. గుడ్లను ఉడకబెట్టడం వల్ల నూనె, వెన్న వంటి వాటి అవసరం ఉండదు. దీంతో తక్కువ క్యాలరీలు, ఎక్కువ పోషకాలను తీసుకోగలుగుతారు. అలాగే తక్కువ ఉష్ణోగ్రతలో వండడం వల్ల వేడి వల్ల నశించే పోషకాలు ఎక్కువగా నశించకుండా ఉంటాయి. కొలెస్ట్రాల్ ఆక్సిడేషన్ కూడా తగ్గుతుంది. ఆలివ్ ఆయిల్ మేలు..ఇక ఉడకబెట్టడంతో పాటు గుడ్లను స్క్రాంబుల్ చేసి కూడా తీసుకోవచ్చు. స్క్రాంబుల్ గుడ్లు కూడా ఆరోగ్యకరమైన ఎంపికల్లో ఒకటి. అయితే దీనిని తయారు చేసేటప్పుడు ఆలివ్ ఆయిల్ లేదా అవకాడో ఆయిల్ వంటి తక్కువ కొవ్వులు ఉన్న నూనెలను ఉపయోగించడం మంచిది. ఇందులో పాలకూర, క్యాప్సికం, టమాటా వంటి కూరగాయలు కలిపి తక్కువ ఉష్ణోగ్రత వద్ద వండి తీసుకోవడం వల్ల మరింత మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అదే విధంగా గుడ్లను ఎక్కువ సమయం ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద వండడం మంచిది కాదని ఇలా వండడం వల్ల హానికరమైన సంయోగాలు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే గుడ్డులో ఉండే పోషకాలను ఎక్కువ మొత్తంలో పొందడానికి వారు కొన్ని సూచనలను కూడా చేస్తున్నారు. కూరగాయలతో కలిపి అయితే..ఎల్లప్పుడూ తాజా లేదా ఆర్గానిక్ గుడ్లను మాత్రమే ఎంచుకోవాలి. తాజా గుడ్లల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే వీటిని పాలకూర, టమాటా, క్యాప్సికం వంటి ఫైబర్ ఎక్కువగా ఉండే కూరగాయలతో కలిపి తీసుకోవడం మంచిది. గుడ్డులోని పోషకాలు ఎక్కువగా పచ్చసొనలోనే ఉంటాయి. కనుక గరిష్ట ప్రయోజనాల కోసం పచ్చసొనను తీసుకోవడం మంచిది. గుడ్డును ఎక్కువ వేడి వద్ద ఎక్కువ సమయం ఉడికించడం వల్ల విటమిన్ డి సుమారు 61 శాతం తగ్గుతుంది. కనుక వీటిని తక్కువ ఉష్ణోగ్రత వద్ద ఉడికించడం మంచిది. గుడ్డు ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికీ వీటిని మితంగా తీసుకోవడం మంచిది. ఆరోగ్యంగా ఉండే వ్యక్తులు రోజుకు ఒక గుడ్డు తినడం సురక్షితం అని నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ విధంగా తగిన సూచనలను పాటిస్తూ గుడ్లను తీసుకోవడం వల్ల వాటి వల్ల కలిగే ప్రయోజనాలను అధిక మొత్తంలో పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా ఉచిత కంటి పరీక్షలు

**–'గిఫ్ట్ హర్ క్లియర్ విజన్' ప్రచారం ప్రారంభించిన డా.అగర్వాల్స్ ఐ హాస్పిటల్**



**విజయవాడ, మార్చి 12 :** డా.అగర్వాల్స్ ఐ హాస్పిటల్ దేశ వ్యాప్తంగా మహిళలకు ఉచిత కంటి పరీక్షలు, కన్సల్టేషన్‌లు అందించేందుకు 'గిఫ్ట్ హర్ క్లియర్ విజన్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆసుపత్రి ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడ హిస్పిటల్ డి.ఎం.పి.కన్సల్టెంట్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ దేశంలోని 280కి పైగా ఐ హాస్పిటల్స్, విజన్ కేర్ సెంటర్ల ద్వారా సుమారు పది లక్షల మహిళలకు ఉచిత కంటి పరీక్షలు అందించడమే ఈ కార్యక్రమ లక్ష్యం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2026 సందర్భంగా ప్రారంభించిన ఈ కార్యక్ర మంలో ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ముఖ్యమైన మహిళకు ఉచిత కంటి పరీక్ష చేయించేందుకు ప్రతిజ్ఞ చేయాలని కోరారు. ఇందుకోసం ఫోన్ : 9003888444 నంబర్‌కు కాల్ చేస్తే సమీపంలోని డా.అగర్వాల్స్ ఐ హాస్పిటల్ కేంద్రంలో మార్చి 8 నుంచి 31 మధ్య ప్రాధాన్యతతో ఉచిత కంటి పరీక్ష అపాయింట్‌మెంట్‌ను బుక్ చేస్తారని తెలిపారు.

# మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చిన బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు గారు









**మిర్యాలగూడ :** మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు, 14వ వార్డు, 38వ వార్డులలో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే శ్రీ భాస్కర్ రావు గారు సందర్శించి పరామ ర్శించా రు. ఈ సందర్భంగా మృతులకు పూలదండలు సమర్పించి నివాళు లర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు కుటుం బానికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతి నిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పిల్లల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలి : బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు...




**జగద్గిరిగుట్ట :** ఈరోజు 126 – జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరిగుట్ట లోని ఇన్ఫాంట్ జీసస్ స్కూల్ లో ప్రీ ప్రైమరీ గ్రేడ్ విద్యార్థులకు నిర్వహించిన "గ్రాడ్యుయేషన్ డే" కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....పిల్లల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారికి కొంత సమయాన్ని కేటాయిస్తూ ఉన్నట్లయితే వారికి తల్లిదండ్రులకు మధ్య సంబంధం, క్రమశిక్షణ, మంచి వాతావరణం మరింత పెంపొంది వారి భవిష్యత్తు ఉజ్వలంగా పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ ఏరువ బాల సుధీర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, సీనియర్ నాయకులు ఎండి.ఆజం, బ్రహ్మానంద్ చారి, ఇందిరా గౌడ్, మెట్ల శ్రీను, ఖయూమ్, కోల శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నివాస ప్రాంతాలకు నూతన విద్యుత్ లైన్



**జైపూర్, మార్చి :12** జైపూర్ మండలం ముదిగుంటలో బోడగూడెం నివాస ప్రాంతానికి నూతన విద్యుత్ లైన్ పనులు ప్రారంభమయ్యాయి. గురువారం స్థానిక సర్పంచ్ రవికుమార్ ఆధ్వర్యంలో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటుకు స్థానిక డివిజన్ విద్యుత్ సిబ్బంది గుత్తేదారితో కలిసి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవి కుమార్ మాట్లాడుతూ బోడగూడెంలో దూరంగా ఉన్న ఇండ్లకు సర్వీస్ కనెక్షన్ల సంఖ్య పెరిగాయని, విద్యుత్ అధికారులకు వినతి అందించామని తెలిపారు. ఈ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, సాంకేతిక సాధ్యతను,అవసరాన్ని బట్టి అంచనాను సంబంధిత అధికారులు వేశారని తెలిపారు.స్తంభాలు, వైర్ల నిడివి ఏర్పాటుకు ఇంతకుముందే విద్యుత్ ఉన్నత అధికారులు ప్రణాళికలు రూపొందించిన ప్రకారం సుమారు 25 స్తంభాలతో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పరిసరాల పరిశుభ్రత పై అవగాహన సదస్సు

**మార్చ్ 12 నిర్మల్ జిల్లా ప్రతినిధి//:**నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ పై పలు వ్యాపార సంస్థలకు హోటల్ యజమానులకు పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ వ్యాపార సంస్థల యజమానులకు,హోటల్స్ యజమానులకు తడి చెత్త పొడి చెత్తను నేరుగా గ్రామపంచాయతీ వినియోగించే ట్రాక్టర్లోనే చెత్తను వెయ్యాలని మరియు ప్లాస్టిక్ వాడకన్ని నిషేధించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా భావించాలని యజమానులకు పలు సూచనలు చేశారు.ఎప్పటికప్పుడు శానిటేషన్ చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ గ్రామ ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి యువకులు పాల్గొన్నారు.




## అంబకంటి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు నిధుల మంజూరు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు సత్కారం.



**మార్చ్ 12 :**భైంసా మండలం పలు మండలం నిధులు మంజూరు కుంటాల మండలం అంబకంటి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.రెండు కోట్లు ముప్పై ఆరు లక్షల నిధులు మంజూరు కావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను గ్రామస్థులు ఘనంగా సత్కరించారు.గ్రామంలో విద్యుత్ సరఫరా మెరుగుపడేందుకు సబ్ స్టేషన్ అత్యవసరమని గ్రామస్థులు తెలిపారు. ఈ అవసరాన్ని గుర్తించి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని చెప్పారు. గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేస్తామని పేర్కొన్నారు.

## చేతి పంపకు మరమ్మతులు చేయించిన గ్రామ సర్పంచ్

**మార్చ్ 12 నిర్మల్ జిల్లా ప్రతినిధి//:**నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో అడెల్లి కమాన్ సమీపంలో చేతిపంపుకు మరమ్మత్తులు చేయించారు రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని బాగు చేయించి గ్రామస్తుల కు తాగునీటి సమస్యను పరిష్కరించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కునేరు భూమన్న వార్డు సభ్యులు పిల్లీ సంతోష్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణళిక లో పాలుగోన్నా ఎమ్మెల్యే పవర్ రామారావు పాటిల్




**మార్చ్ 12:**నిర్మల్ పట్టణంలోని నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజుల కార్యాచరణ పై అవగాహన కల్పించే దిశా నిర్దేశ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మరియు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ దేగాం సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని వారు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అధికారులు, కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పాల్గొని అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు పై చర్చించారు. గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# అట్టహాసంగా సాగిన ప్రజాపాలన ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు






## ప్రత్యేక ప్రణాళికలను అమలు చేసి ప్రగతిని సాధిద్దాం జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్

**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి:**నిర్మల్ పట్టణంలోని తిరుమల గార్డెన్స్ లో, ఇటీవలి ఎన్నికైన గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, నిర్మల్,ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యే లు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి, తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు.పలువురు చిన్నారులచే ప్రదర్శింపబడిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వీరికి కలెక్టర్, ఎమ్మెల్యే లు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలు, కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరాలనే ఉద్దేశంతో 99 రోజుల ప్రత్యేక ప్రణాళికను ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ప్రత్యేక ప్రణాళిక జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజల్లో ఉన్న అనారోగ్య సమస్యలను తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులందరికీ పంచాయతీరాజ్ మున్సిపల్ చట్టాలపై అవగాహన ఉండాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ. ప్రజా ప్రతినిధులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం గొప్ప విషయం అని, నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు అంతా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసు కుంటూ,పరిష్కరించే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి కృషి చేయాలని. అధికారులు పెండింగ్లో ఉన్న పైల్స్ అన్నింటిని 99 రోజుల ప్రణాళికలో భాగంగా పుష్కరించాలని తెలిపారు.ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ.ప్రజా సంక్షేమానికై, అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని . ఇటీవలి స్థానిక సంస్థల్లో ఎన్నికైన వారిలో ఎక్కువ శాతం యువత ఉన్నారని. వీరంతా ఉత్సాహంగా ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ పథకాల అమలులో కృషి చేయాలని ఆయన తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.నిర్మల్ జిల్లా ప్రతి గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే కీలకపాత్ర అని . ప్రజా ప్రతినిధులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధాన కర్తనులుగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు గ్రామసభలు నిర్వహిస్తూ, గ్రామంలోని సమస్యలను తెరుసుకొని పరిష్కరించాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులకు ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా, వారికి పరిపాలన జ్ఞానం పెరుగుతుందని జిల్లాకు నిధులు తీసుకురావడంలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు.అనంతరం పెంబి ఆస్పిరేషన్ బ్లాక్ ను అభివృద్ధి పథంలో నడిపిన ప్రజాప్రతినిధులను, సన్మానించి అభినందించారు. అధికారులు ప్రజల విలువైన భాగస్వామ్యంతోనే పెంబి ఆస్పిరేషన్ నుంచి నుంచి ఇన్స్పిరేషన్ వైపు పయనించిందని కొనియాడారు. రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలలో అద్భుత ప్రగతి కనబరిచి పథకాలు సాధించిన క్రీడాకారులకు జ్ఞాపికలు అందించి, సన్మానించారు.వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం











శాఖల వారీగా సర్పంచులు ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకూ చేరాలని, అభివృద్ధి పనుల్లో ఎక్కడా జాప్యం జరగకూడదని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. అనంతరం, మండలాల వారీగా విచ్చేసిన సర్పంచులు, మున్సి పల్ కౌన్సిలర్లతో కలెక్టర్ విడివిడిగా భేటీ అయ్యారు. వారి సమ స్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, వారితో కలిసి సామూహిక చిత్రాలు దిగారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు,కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పల కావ్య వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి పైసా మునిసిపల్ చైర్మన్ దత్తాత్రీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద అల్లి డి ఎల్ ఎస్ ఏ సెక్రటరీ రాధిక జిల్లా అధికారు లు, సర్పంచులు మున్సిపల్ కౌన్సిలర్లు వివిధ శాఖల అధికారులు మరియు సిబ్బంది ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎండాకాలం లో రాగి జావ..బార్లీ జావ- ఎవరికి ఏది మంచిది..!!



వేసవి మొదలైంది. అప్పుడే ఎండలు దంచికొడుతున్నాయి. తీవ్రమైన ఎండల వల్ల వడదెబ్బ, నీరసం, డీహైడ్రేషన్, కళ్లు తిరగడం, తలనొప్పి వంటి సమస్యలతో ఇబ్బందులు తప్పేలా లేవు. సరైన పోష్టికాహారం తీసుకోవటం ద్వారా ఎండల వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. మరీ ముఖ్యంగా రాగి .. బార్లీ జావ తాగటం ఎండాకాలంలో ఎంతో మేలు చేస్తుంది. అయితే.. ఈ రెండు జావలు వేసవిలో శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ఎవరికి ఏది మంచి చేస్తుందనేది నిపుణులు స్పష్టత ఇస్తున్నారు.వేసవిలో ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. శరీరం డీ హైడ్రేట్ కాకుండా చూసుకోవటం చాలా అవసరం. ఈ సమయంలో కొబ్బరి నీళ్లు, చెరుకు రసాలతో పాటుగా శరీరానికి బలం ఇస్తూ వేసవి నుంచి కాపాడే జావలు తీసుకోవటం మంచింది. అందులో రాగి జావ.. బార్లీ జావతో ఎక్కువగా ప్రయోజనాలు ఉంటాయి. రాగుల్లో పుష్కలంగా కాల్షియం ఉంటుంది. ఇది ఎముకలు దృఢంగా ఉంచడంతో ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రోటీన్లు, విటమిన్లు, ఏ,బీ,సీ ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. జీర్ణశక్తి మెరుగుపడుతుంది. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో ఉపయోగపడుతుంది. రాగుల్లో మినరల్స్ కూడా ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఎముకలు బలంగా మారతాయి. అందుకే వయసు పెరిగిన వారు.. చిన్నపిల్లలు వీటిని రెగ్యులర్‌గా తీసుకోవాలి. రక్తహీనత నివారణకు, మధుమేహ నియంత్రణకు, బరువు తగ్గడానికి రాగులు సూపర్ ఫుడ్‌గా పనిచేస్తాయి. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కారణంగా రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఆకలిని నియంత్రించి బరువు తగ్గడంలో సహాయపడుతుంది.వేసవిలో జావలతో ఆరోగ్య ప్రయోజనాలు రాగుల్లో ఆక్సలేట్లు ఎక్కువగా ఉంటాయి. కిడ్నీ స్టోన్స్ ఉన్నవారు, కిడ్నీ వ్యాధులు ఉన్నవారు అధికంగా రాగి జావ తీసుకోకూడదు. అదే విధంగా బార్లీ జావ సైతం వేసవిలో మంచి ఔషధం గా పని చేస్తుంది. ఒక కప్పు బార్లీ గింజలను ముందుగా నానబెట్టుకోవాలి. ఆ తర్వాత తగినన్నీ నీళ్లు పోసుకుని ఉడికించుకోవాలి. మజ్జిగ, ఉప్పు, జీకర్ర పొడి కలుపుకోవాలి. తాగేటప్పుడు నిమ్మరసం వేసుకుని తాగితే ఆరోగ్యానికి ఎంతో మంచిది. రుచి కావాలంటే దానిమ్మ గింజలను కూడా వేసుకోవచ్చు. బార్లీజావలో పీచు పదార్థాలు ఎక్కువ. అందుకే త్వరగా ఆకలి వేయదు. బరువును నియంత్రిస్తుంది. జలుబు వంటి సమస్య లను దూరం చేస్తుంది. అదే సమయంలో ఇప్పటికే పలు సమస్యలకు చికిత్స తీసుకుంటున్న వారు.. ప్రధానంగా మూత్రపిండాల సమస్యతో ఉన్న వారు మాత్రం వైద్యుడి సలహా మేరకు ఈ జావలను తీసుకోవటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



# హార్దిక్ పాండ్యాపై కేసు నమోదు..

భారత క్రికెటర్ హార్దిక్ పాండ్యాపై జాతీయ జెండాను అవమానించారనే ఆరోపణలతో పుణే పోలీసులకు ఫిర్యాదు నమోదైంది. పుణేలోని శివాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో అడ్వకేట్ వజీద్ ఖాన్ ఈ ఫిర్యాదు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. అహ్మదాబాద్‌లో జరిగిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్ అనంతరం భారత జట్టు విజయోత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఈ ఘటన జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ప్రకారం హార్దిక్ పాండ్యా జాతీయ త్రివర్ణ పతాకాన్ని తన శరీరానికి చుట్టుకొని మైదానంలో అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఈ చర్య భారత జాతీయ జెండా గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దేశ పౌరులందరికీ జాతీయ పతాక గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. అయితే ఈ ఫిర్యాదుపై పోలీసులు ఇంకా వివరాలు వెల్లడించలేదు. ఇక క్రికెట్ పరంగా చూస్తే టీ20 వరల్డ్ కప్ 2026లో హార్దిక్ పాండ్యా అద్భుత ప్రదర్శన కనబరిచారు. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ కీలక పాత్ర పోషించారు. టోర్నమెంట్ మొత్తం మీద ఆయన తొమ్మిది వికెట్లు పడగొట్టడంతో పాటు రెండు అర్ధశతకాలు కూడా నమోదు చేశారు. ముఖ్యంగా నమీబియాపై జరిగిన మ్యాచ్‌లో 28 బంతుల్లో 52 పరుగులు చేసి జట్టుకు కీలక విజయాన్ని అందించారు.పాండ్యా ప్రదర్శనను గుర్తించిన ఐసీసీ అతన్ని 2026 టీ20 వరల్డ్ కప్ టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్‌లో చోటు కల్పించింది. ఇది అతని ఆల్‌రౌండ్ ప్రతిభకు మరో గుర్తింపుగా భావిస్తున్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. ఈ విజయంతో టీమిండియా వరుసగా రెండోసారి టీ20 వరల్డ్ కప్‌ను కైవసం చేసుకుంది. ఇక మొత్తంగా మూడు సార్లు ఈ టైటిల్‌ను గెలిచిన తొలి జట్టుగా భారత్ చరిత్ర సృష్టించింది. 2007లో తొలి టీ20 వరల్డ్ కప్ గెలిచిన భారత్, ఇప్పుడు మళ్లీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

# తొలి పోరులో బెంగళూరుతో హైదరాబాద్ ఢీ!

**ఐపీఎల్ 2026 సమరానికి షెడ్యూల్ ఖరారు**

**డిఫెండింగ్ ఛాంపియన్‌తోనే ఆరంభం**

**బెంగళూరు వేదికపై కొనసాగుతున్న సస్పెన్స్**



క్రికెట్ ప్రేమికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్‌కు నగారా మోగింది. టాటా ఐపీఎల్ 2026 తొలి దశ షెడ్యూల్‌ను బీసీసీఐ బుధవారం విడుదల చేసింది. మార్చి 28 నుండి ఏప్రిల్ 12 వరకు జరగనున్న మొదటి దశలో మొత్తం 20 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మూడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున ఎన్నికల తేదీలు ప్రకటించిన తర్వాతే ఐపీఎల్ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేస్తామని బోర్డు ప్రకటించింది. మార్చి 28న బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా జరగనున్న ఆరంభ వేడుకల అనంతరం తొలి పోరు ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , మాజీ ఛాంపియన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తొలి మ్యాచ్‌లో తలపడనున్నాయి. సొంత గడ్డపై ఆర్‌సీబీ బోణీ కొట్టాలని చూస్తుండగా, హైదరాబాద్ తమ సత్తా చాటేందుకు సిద్ధమైంది. మరుసటి రోజు ఆదివారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు ఢీకొంటాయి. తొలి దశలో మొత్తం నాలుగు డబుల్ హెడర్ అంటే రోజుకు రెండు మ్యాచ్‌లు మ్యాచ్‌లు ఉన్నాయి. మధ్యాహ్నం మ్యాచ్‌లు 3:30 గంటలకు, రాత్రి మ్యాచ్‌లు 7:30 గంటలకు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 4న సీజన్‌లో తొలి డబుల్ హెడర్ జరగనుంది. ఆ రోజు మధ్యాహ్నం ఢిల్లీ వర్సెస్ ముంబై, రాత్రి గుజరాత్ టైటాన్స్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సీజన్‌లో మ్యాచ్‌లు బెంగళూరు, ముంబై, గౌహతి, న్యూ చండీగఢ్, లక్నో, కోల్‌కతా, చెన్నై, ఢిల్లీ, అహ్మదాబా, హైదరాబాద్‌లలో జరగనున్నాయి. రాజస్థాన్ రాయల్స్ తమ తొలి హోమ్ మ్యాచ్‌లను గౌహతిలో ఆడనుంది. అక్కడ చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. పంజాబ్ కింగ్స్ తమ హోమ్ మ్యాచ్‌లను న్యూ చండీగఢ్‌లోని పీసీఏ స్టేడియంలో ఆడుతుంది. ఆర్‌సీబీకి బెంగళూరుతో పాటు రాయ్‌పూర్ రెండో హోమ్ గ్రౌండ్‌గా ఉండగా, పంజాబ్ కింగ్స్ ధర్మశాలలో, రాజస్థాన్ రాయల్స్ జైపూర్‌లో కూడా తమ హోమ్ మ్యాచ్‌లను ఆడనున్నా యి. అయితే బెంగళూరులో జరగాల్సిన మ్యాచ్‌లు కర్ణాటక ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ క్లియరె న్స్‌పై ఆధారపడి ఉన్నాయి. మార్చి 13న ఈ కమిటీ చిన్నస్వామి స్టేడియాన్ని సందర్శించి, మ్యాచ్ నిర్వహ ణకు ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలిస్తుంది. పూర్తిస్థాయి మాక్ డెమాన్స్ట్రేషన్ తర్వాతే బెంగళూరు వేదికపై తుది నిర్ణయం వెలువడనుంది.

# హైదరాబాద్‌కు ఒకే ఒక్క హోమ్ మ్యాచ్ ఉండటం సమస్యే...

**● టీమిండియా మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా**



ఐపీఎల్ 2026 ఫస్ట్ ఫేజ్ షెడ్యూల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఒకే ఒక్క హోమ్ మ్యాచ్ ఉండటం ఇబ్బంది కలిగించే విషయమేనని టీమిండియా మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా అన్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో పాటు గుజరాత్ టైటాన్స్‌కు కూడా ఒక్క హోమ్ మ్యాచ్ ఉందని తెలిపాడు. ఐపీఎల్ 2026 షెడ్యూల్‌ను బీసీసీఐ బుధవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. పలు రాష్ట్రాల్లో ఎన్నికల నేపథ్యంలో 20 మ్యాచ్‌ల షెడ్యూల్‌నే వెల్లడించింది. మార్చి 28 నుంచి ఈ క్యాష్ రిచ్ లీగ్‌కు తెరలేవనుండగా.. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) తలపడనుంది. ఈ ఫస్ట్ ఫేజ్ షెడ్యూల్ ఆరెంజ్ ఆర్మీ మొత్తం 4 మ్యాచ్‌లు ఆడనుండగా.. ఇందులో ఒక్కటి మాత్రమే హైదరాబాద్ వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. అయితే ఈ టోర్నీ ఆరంభంలోనే ఎక్కువ మ్యాచ్‌లు ఇతర వేదికల్లో ఆడాల్సి రావడం సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు సమస్యగా మారుతుందని చోప్రా అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ షెడ్యూల్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన ఆకాశ్ చోప్రా.. సన్‌రైజర్స్ మ్యాచ్‌ల గురించి కీలక వ్యాఖ్యలు చేశాడు. 'సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు బ్యాటింగ్‌కు అనుకూలించే ఫ్లాట్ పిచ్‌లు అవసరం. గత సీజన్‌లో సొంత మైదానంలో కూడా వారికి ఆశించిన పిచ్‌లు దక్కలేదు. ఈ సారి పరిస్థితి మరింత భిన్నంగా ఉంది. ఆరంభంలో కేవలం ఒకే ఒక మ్యాచ్ హోమ్ గ్రౌండ్‌లో ఆడనుంది. హైదరాబాద్ దూకుడుగా సీజన్ ప్రారంభించాలంటే మంచి బ్యాటింగ్ పిచ్ అవసరం. చిన్నస్వామిలో ఆ అవకాశం ఉంటుంది.



# అర్ష్‌దీప్ సింగ్‌ను వెనకేసుకొచ్చిన గంభీర్..!

టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ మరియు మిచెల్ మధ్య జరిగిన వాగ్వాదంపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. అర్ష్‌దీప్ సింగ్.. మిచెల్‌కు క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదన్నాడు గంభీర్. మార్చి 8వ తేదీ, ఆదివారం రోజున అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 11వ ఓవర్‌ను.. భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ వేశాడు. అప్పుడు క్రీజ్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ ఉన్నాడు. ఇక అర్ష్‌దీప్ సింగ్ వేసిన రెండు బంతులను వరుసగా డారిల్ మిచెల్ సిక్సర్లుగా మలిచాడు. దీంతో అర్ష్‌దీప్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. ఆ తరువాత వేసిన మూడవ బంతిని మిచెల్ షాట్ ఆడగా.. బాల్‌ను అర్ష్‌దీప్ ఆపాడు. వెంటనే బాల్‌ను వికెట్ల పైకి విసరకుండా మిచెల్ పైకి విసిరాడు. దీనిపై మిచెల్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఏంటి అన్నట్లుగా అర్ష్‌దీప్ సింగ్‌ను ప్రశ్నించాడు. అర్ష్‌దీప్ మాత్రం ఏమీ పట్టించుకోకుండా, కనీసం క్షమాపణ చెప్పకుండా తిరిగి తరువాత బంతిని వేసేందుకు వెళ్లిపోయాడు. అయితే.. టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం డారిల్ మిచెల్ వద్దకు వెళ్లి అతడికి సర్దిచెప్పాడు. అంపైర్ నచ్చజెప్పడంతో ఓవర్ పూర్తి కాగానే మిచెల్‌కు అర్ష్‌దీప్ సింగ్ క్షమాపణ చెప్పాడు. తాను కావాలని బంతిని విసరలేదని, బాల్ స్వింగ్ అయి మిచెల్‌ను తాకిందని, ఇందుకు అతడికి సారీ చెప్పినట్లు మ్యాచ్ అనంతరం అర్ష్‌దీప్ సింగ్ చెప్పాడు. అయితే ఈ విషయంపై టీమిండియా హెడ్ కోడ్ గౌతమ్ గంభీర్ మాట్లాడుతూ.. దేశం కోసం ఆడేటప్పుడు ఆటగాళ్లు దూకుడుగా ఉండటం సహజమని అన్నారు. వరుసగా రెండు సిక్సర్లు కొట్టినప్పుడు బౌలర్ నుంచి ప్రతిస్పందన రావడం సాధారణమని.. క్షమాపణ చెప్పకపోయినా ఎలాంటి సమస్య ఉండదని గంభీర్ అభిప్రాయపడ్డారు. అలాగే గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగేవని, అయితే ఇప్పుడు సోషల్ మీడియా కారణంగా ప్రతి చిన్న విషయం కూడా పెద్దగా మారుతోందని గంభీర్ వ్యాఖ్యానించారు. ఇక ఈ ఘటన తర్వాత ఐసీసీ (ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్) అర్ష్‌దీప్ సింగ్‌పై మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధించింది. అదేవిధంగా ఒక డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది. అయితే గత 24 నెలల్లో ఇది మొదటి తప్పు కావడంతో అతనిపై పెద్ద శిక్ష విధించలేదు.

# తొలి వన్డేలో పాకిస్థాన్‌పై బంగ్లాదేశ్ సూపర్ విక్టరీ




టీ20 వరల్డ్ కప్‌లో సెమీస్ చేరకుండా ఇంటిముఖం పట్టిన పాకిస్థాన్ టీమ్.. ఈ సారి బంగ్లాదేశ్ చేతిలో దారుణంగా పరువు పోగొట్టుకుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆతిథ్య బంగ్లాదేశ్ అదిరిపోయే బోణీ కొట్టింది. బుధవారం షేర్-ఎ-బంగ్లా స్టేడియంలో జరిగిన మొదటి వన్డేలో 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. బంగ్లా బౌలర్ నహీద్ రానా నిప్పులు చెరిగే బౌలింగ్‌తో పాక్ బ్యాటింగ్ నడ్డి విరవగా.. బ్యాటింగ్‌లో తాంజిద్ హసన్ మెరుపు హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించాడు. మొదట టాస్ గెలిచిన బంగ్లాదేశ్ కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్.. బౌలింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నిర్ణయాన్ని బౌలర్లు సరైనదని నిరూపిస్తూ బంగ్లా బౌలర్లు రెచ్చిపోయారు. టీ20 వరల్డ్ కప్ ఆడలేదనే కసిని మొత్తం తీర్చుకున్నట్లు అనిపించింది. ముఖ్యంగా యువ పేసర్ నహీద్ రానా.. అద్భుత స్పెల్‌తో పాక్ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. పాకిస్థాన్ 30.4 ఓవర్లలో కేవలం 114 పరుగులకే కుప్పకూలింది. పాక్ జట్టులో ఫహీమ్ అష్రఫ్ (37), ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ (27) మినహా ఎవరూ రెండంకెల స్కోరును దాటలేకపోయారు. స్టార్ బ్యాటర్లు మహమ్మద్ రిజ్వాన్ (10), సల్మాన్ అఘా (5) వంటి కీలక ఆటగాళ్లు విఫలం అయ్యారు. నహీద్ రానా 7 ఓవర్లలో 24 పరుగులే ఇచ్చి 5 కీలక వికెట్లు పడగొట్టగా.. కెప్టెన్ మిరాజ్ 3 వికెట్లు తీశాడు. తస్కిన్ అహ్మద్, ముస్తఫిజుర్ రెహ్మాన్ చెరో వికెట్ తీశారు.అనంతరం 115 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్.. కేవలం 15.1 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఓపెనర్ తాంజిద్ హసన్ కేవలం 42 బంతుల్లోనే 5 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో 67 పరుగులతో జట్టును గెలిపించాడు.


వన్‌డౌన్ బ్యాట్స్‌మెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో 27 పరుగులు చేశాడు. పాక్ బౌలర్లలో షాహీన్ అఫ్రిది, మహమ్మద్ వసీంలకు తలో వికెట్ దక్కింది.

# టీ20 టీమ్ కెప్టెన్‌గా సంజూ శాంసన్..



సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్ గెలుపుతో టీమిండియా సంబరాల్లో మునిగిపోయింది. మూడుసార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలి జట్టుగా భారత్ నిలవగా.. సొంతగడ్డపై టైటిల్ గెలిచిన మొదటి జట్టుగా రికార్డు క్రియేట్ చేసింది. 2024 వరల్డ్ కప్ విజయం తరువాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వంటి స్టార్లు రిటైర్‌మెంట్ ప్రకటనతో యువ జట్టు ఎలా ఆడుతుందో అని అనుమానాలు ఉన్నా.. అన్ని ఫటాపంచల్ చేస్తూ విశ్వవిజేతగా నిలిచింది. రోహిత్ శర్మ నుంచి టీ20 పగ్గాలు అందుకున్న సూర్యకుమార్ యాదవ్.. ఇప్పటివరకు ఒక్క సిరీస్ కూడా ఓడిపోని కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. ఆసియా కప్, టీ20 ప్రపంచకప్ గెలిపించిన కెప్టెన్‌గా నిలిచాడు. ఇక భవిష్యత్ ప్లానింగ్స్ గురించి ప్రస్తుతం చర్చలు మొదలయ్యాయి. ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ 35 ఏళ్లు కాగా.. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్, వచ్చే వరల్డ్ కప్ (2028) నాటికి సూర్యకు 37 ఏళ్లు వస్తాయి. అప్పటివరకు టీమ్‌లో ఉన్నా.. కెప్టెన్‌గా కొనసాగుతాడా లేదా అనేది అనుమానమే. ప్రస్తుతం ఉన్న టీమ్‌లో కెప్టెన్సీ రేసులో చాలామంది పేర్లు వినిపిస్తున్నాయి. ముందు వరుసలో మాత్రం సంజూ శాంసన్ పేరు మారుమోగిపోతుంది. టీ20 వరల్డ్ కప్ సూపర్-8 ఆఖరి మ్యాచ్ నుంచి ఫైనల్ మ్యాచ్ వరకు హ్యాట్రిక్ హాఫ్ సెంచరీలతో భారత్ విశ్వవిజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ టీమ్‌కు కెప్టెన్‌గా పని చేసిన అనుభవం ఉండడం.. టీమ్‌లో సీనియర్ ప్లేయర్ కావడంతో సూర్యకు సరైన వారసుడు సంజూనే అని మాజీలు విశ్లేషిస్తున్నారు. కొత్త కెప్టెన్సీ అంశంపై భారత మాజీ క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ మాట్లాడుతూ.. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో టీమిండియా కెప్టెన్సీకి సంజూ శాంసన్ బలమైన పోటీదారుడని చెప్పాడు. సంజూకు కెప్టెన్ ఉండాల్సిన అనుభవం, అవగాహన ఉందని అన్నాడు. క్లిష్ట సమయాల్లో కూడా ఎలాంటి టెన్షన్ లేకుండా సంజూ నిర్ణయాలు తీసుకోగలడని పేర్కొన్నాడు. సూర్య తరువాత కొత్త కెప్టెన్ ఎవరు అని ఇప్పుడే చెప్పడం కష్టమైనా.. సంజూ మాత్రం ముందు వరుసలో ఉంటాడని అన్నాడు. కెప్టెన్ ప్రపంచాన్ని చూసిన వ్యక్తి అయి ఉండాలని.. బౌలింగ్‌లో మార్పులు.. సరైన ప్లేయర్లను తుది జట్టులో ఆడించడం.. ఫామ్‌లో లేని ఆటగాళ్లకు మద్దతుగా ఉండడం ఇవన్నీ ఆటలో భాగమని కెప్టెన్‌గా తెలిసి ఉండాలన్నాడు. "సంజూ కచ్చితంగా కెప్టెన్సీ రేసులో ఉంటాడని నేను భావిస్తున్నాను. సూర్య రిటైర్‌మెంటె ప్రకటిస్తే.. సంజూ ఆ స్థానాన్ని భర్తీ చేయగలడు. ఐపీఎల్‌లో చాలా మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. రాజస్థాన్ రాయల్స్ ను 2022 ఫైనల్‌కు నడిపించాడు. సంజూ వయస్సు కేవలం 31 సంవత్సరాలు. టీమిండి యా తదుపరి కెప్టెన్ కావచ్చు" అని కైఫ్ చెప్పుకొ చ్చాడు. ప్రస్తుతం టీమ్‌లో ఉన్న వారిలో హార్దిక్ పాండ్యాకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించి.. మళ్లీ తీసేశారు. వైస్ కెప్టెన్‌గా ఉన్న అక్షర్ పటేల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే అవకాశాలు తక్కువే. మిగిలిన వారందరితో పోల్చినా.. సంజూనే బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తున్నాడని ఇతర మాజీ ప్లేయర్లు కూడా అంటున్నారు.

# లుక్‌తో అంచనాలు పెంచుతున్న చైతూ



'తండేల్' సినిమా సూపర్ హిట్ తర్వాత నాగ చైతన్య కెరీర్ విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నాడని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయన ఎంపిక కూడా అలాగే అనిపిస్తుంది. చాలా కాలంగా ఎదురు చూస్తున్న నాగచైతన్య మూవీ అప్‌డేట్ వచ్చింది. విరూపాక్ష దర్శకుడు కార్తీక్ దండు దర్శకత్వంలో నాగ చైతన్య హీరోగా వృషకర్మ రూపొందుతున్న విషయం తెల్సిందే. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో నాగ చైతన్య లుక్ పై ఇటీవలే క్లారిటీ వచ్చింది. ఇప్పటి వరకు చైతన్యను చూడని విధంగా దర్శకుడు కార్తీక్ చూపించబోతున్నాడు. అంతే కాకుండా నాగ చైతన్య యొక్క గత చిత్రాలతో పోల్చితే ఈ సినిమా పూర్తి విభిన్నంగా ఉంటుందని అంటున్నారు. విరూపాక్ష సినిమాకు ఏమాత్రం తగ్గకుండా దర్శకుడు కార్తీక్ ఈ సినిమాను రూపొందించే పనిలో ఉన్నాడని తెలుస్తోంది. తాజాగా నాగ చైతన్య షేర్ చేసిన ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బీయింగ్ అర్జున్ అంటూ జిమ్‌లో డంబెల్స్‌తో వర్కౌట్ చేస్తున్న ఫోటోలను షేర్ చేయడంతో పాటు, ఆన్ సెట్ ఫోటోలు, సినిమాలోని లుక్ ను రివీల్ చేయడం ద్వారా నాగ చైతన్య మరోసారి సినిమా గురించి చర్చ జరిగేలా చేశాడు. అర్జున్ పాత్ర కోసం నాగ చైతన్య ఎంతగానో కష్టపడుతున్నాడు. జిమ్‌లో ఆయన వర్కౌట్స్ గంటల పాటు సాగుతున్నట్లు ట్రైనర్ చెప్పుకొచ్చాడు. ఇప్పటికే నాగ చైతన్య సిక్స్ ప్యాక్ బాడీతో చాలా ఫిట్ గా కనిపిస్తున్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా చాలా ఫిట్‌గా నాగ చైతన్య కనిపిస్తున్నాడు అంటూ ఈ ఫోటోలకు అభిమానులు తెగ కామెంట్స్ చేస్తున్నారు. నాగ చైతన్య లుక్ కి అంతా ఫిదా కావడం మాత్రమే కాకుండా వృషకర్మ సినిమాపై అంచనాలు మరింతగా పెరుగుతున్నాయి.తండేల్ సినిమా తర్వాత.. సాధారణంగా నాగ చైతన్య అనగానే ఒక సాఫ్ట్ కార్నర్ కుర్రాడు గుర్తుకు వస్తాడు. కానీ ఈ సినిమా తర్వాత మొత్తం మారబోతుంది. తండేల్‌తో కొంత వరకు తన ఇమేజ్‌ను మార్చుకున్న నాగ చైతన్య ఇప్పుడు పూర్తిగా తన ఇమేజ్ ను మార్చుకునే పనిలో ఉన్నాడట. పూర్తి స్థాయి యాక్షన్ సినిమాలు గతంలో చేసిన నాగ చైతన్య, అందుకు తగ్గ ఫిజిక్ ను ట్రై చేయలేదు. కానీ ఈసారి పాత్రలకు తగ్గట్లుగా ఫిజిక్ ను రెడీ చేసుకుంటూ, తన అభిమానులను నూటికి నూరు శాతం సంతృప్తి పరచడం కోసమే అన్నట్లుగా నాగ చైతన్య సినిమాలకు రెడీ అవుతున్న తీరు చూస్తుంటే ముచ్చటేస్తుందని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తుంది. ఈ మధ్య కాలంలో నాగ చైతన్య సినిమాల సంఖ్య తగ్గించినప్పటికీ క్వాలిటీ పెంచాడనే టాక్ కూడా ఉంది. మరో వంద కోట్ల మూవీ లోడ్ కావాలి అంటే ఇంతకు మించి అన్నట్లుగా నాగ చైతన్య కష్టపడాల్సిందే అంటూ అభిమానులు మాట్లాడుకుంటున్నారు.


వృషకర్మ సినిమా నిర్మాణంలో సుకుమార్ భాగస్వామ్యం కావడంతో పాటు, ఆయన స్క్రిప్ట్ వర్క్ సలహాలు కచ్చితంగా వర్కౌట్ అవుతాయనే విశ్వాసంను అంతా వ్యక్తం చేస్తున్నారు. విభిన్న చిత్రాలతో దర్శకుడు కార్తీక్ దండు ముందు ముందు స్టార్ దర్శకుల జాబితాలో చేరబోతున్నాడనే విశ్వాసం కూడా వ్యక్తం అవుతోంది. మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్ మూవీగా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్ వీడియోకు మంచి స్పందన వచ్చింది. సినిమా ఎప్పుడెప్పుడు విడుదల అవుతుందా అని అక్కినేని ఫ్యాన్స్‌తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాతో నాగ చైతన్య బాక్సాఫీస్ వద్ద మరోసారి తన సత్తా చాటడం ఖాయం. వంద కోట్లతో మరోసారి బాక్సాఫీస్ ను నాగ చైతన్య షేక్ చేయాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. ఈ ఫోటోలు చూస్తుంటే బాక్సాఫీస్ ను షేక్ చేసేందుకు చైతూ జిమ్ లో కసరత్తులు చేస్తున్నట్లుగా అనిపిస్తోంది.

# స్పీడ్‌గా ఎన్టీఆర్ డ్రాగన్ షూటింగ్



ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఇటీవల జోర్డాన్‌లో కీలకమైన షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న చిత్ర యూనిట్, ఇప్పుడు తదుపరి యాక్షన్ వేట కోసం సిద్ధమైంది. జోర్డాన్ షెడ్యూల్‌లో హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించాడు ప్రశాంత్ నీల్. ఇక ఇప్పుడు నెక్స్ట్ షెడ్యూల్‌లో కూడా భారీ యాక్షన్ ఉండబోతుందని తెలుస్తోంది. కొత్త షెడ్యూల్ ఈ వారంలోనే హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని సమాచారం. ఇందుకోసం నగర శివార్లలోని ఒక ప్రముఖ స్టూడియోలో మూడు భారీ సెట్లను నిర్మించారట. ఇందులో విలన్ ఇంటికి సంబంధించిన సెట్ కూడా ఉందట. దాదాపు నెల రోజులకు పైగా సాగే ఈ లాంగ్ షెడ్యూల్‌లో.. సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. ఇక ఇక్కడ షూటింగ్ పూర్తయిన వెంటనే, చిత్ర యూనిట్ తదుపరి షెడ్యూల్ కోసం శ్రీలంక వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అక్కడ కూడా యాక్షనే ఉంటుందని టాక్. మొత్తంగా చూసుకుంటే.. డ్రాగన్ యాక్షన్ షెడ్యూల్సే ఎక్కువగా ఉన్నాయి. ఈ లెక్కన ప్రశాంత్ నీల్ ఏ రేంజ్ యాక్షన్ డోస్ ఇవ్వబోతున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ మరియు మలయాళ నటుడు టోవినో థామస్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. 'కె.జి.ఎఫ్', 'సలార్' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో.. డ్రాగన్ పై అంచనాలు పీక్స్‌లో ఉన్నాయి.

# డిఫరెంట్‌గా దీవానా మూవీ టీజర్




టాలీవుడ్ యువ నటుడు హర్షిత్ రెడ్డి హీరోగా, స్నేహ మణిమేగలై హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'దీవాన'. ఈ చిత్ర టీజర్‌ను నేడు విడుదల చేశారు మేకర్స్. టీజర్ ఆరంభం నుంచి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ఒక యువకుడు ప్రేమలో పడి, ఆ ప్రేమ కోసం ఏ స్థాయికైనా వెళ్లే 'దీవాన' గా ఎలా మారాడనేది ఈ చిత్ర ప్రధానాంశం. ముఖ్యంగా ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తారురా పోరీలు' మరియు 'అది నీ ప్రాణం పీక్క తినకపోతే నన్ను అడుగురా' వంటి డైలాగులు యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణ అర్బన్ నేపథ్యంలో సాగే ఈ స్వచ్ఛమైన మరియు ఇంటెన్స్ లవ్ స్టోరీలో హర్షిత్ రెడ్డి తన నటనతో మరియు డైలాగ్ డెలివరీతో ఆకట్టుకున్నాడు.ఈ సినిమాకు శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వం వహించగా.. అర్హా మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్స్‌లపై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సమ్మర్ కానుకగా ఏప్రిల్ 14న ఈ చిత్రం రాబోతుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ ఈ మూవీని డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది.



# బేబీ పింక్ లెహంగాలో ఆకట్టుకుంటున్న బేబమ్మ..


ప్రస్తుత కాలంలో హీరోయిన్లు ఎక్కువగా సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ ను ఉపయోగిస్తూ తమ అందాలను ఆరబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. ఒకవైపు హీరోయిన్ గా బిజీగా ఉంటూనే.. మరొకవైపు అభిమానులకు ఎప్పటికప్పుడు చేరువలో ఉండడానికి గ్లామర్ వలకబోస్తూ ప్రత్యేకంగా ఫోటోషూట్ నిర్వహిస్తూ మరీ.. వాటిని షేర్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా మొదటి సినిమాతోనే 100 కోట్ల క్లబ్లో చేరి అందరి దృష్టిని తన వైపు తిప్పుకున్న బేబమ్మ అలియాస్ కృతి శెట్టి గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు.కన్నడ ఇండస్ట్రీకి చెందిన కృతి శెట్టి.. తెలుగులో సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సనా తొలి ప్రయత్నంలో చేసిన 'ఉప్పెన' సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైంది. మొదటి సినిమాలో బేబమ్మ క్యారెక్టర్ లో తన పాత్రలో లీనం అయిపోయి అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇందులో మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ హీరోగా నటించారు. పైగా దర్శకుడికి, ఈ నటీనటులు ఇద్దరికీ కూడా ఈ సినిమా మొదటి సినిమా కావడం గమనార్హం . మొదటి సినిమానే అయినా అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. వంద కోట్ల క్లబ్లో చేరి మెప్పించారు. పైగా ఈ చిత్రానికి బోలెడు అవార్డులు కూడా లభించాయి. ూశ్రీంశీ =ఘుఃం - ఎనిమిదేళ్లుగా వేధిస్తున్నారు.. నేనేంటో చూపిస్తా -రష్మిక మందన్న! ఈ సినిమా ఇచ్చిన ఫలితం ఈమెకు వరుసగా అవకాశాలు అందించింది. అలా నానితో కలిసి శ్యామ్ సింగరాయ్, నాగచైతన్య, నాగార్జున కలయికలో వచ్చిన బంగార్రాజు సినిమాలో నాగచైతన్య సరసన నటించి హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇక తర్వాత ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, ది వారియర్, మాచర్ల నియోజకవర్గం, కస్టడీ , మనమే, అన్నగారు వస్తారు ఇలా పలు చిత్రాలు చేసింది. కానీ ఏవి కూడా మంచి విజయాన్ని అందించలేదు. కానీ ఇప్పుడు కోలీవుడ్లో బిజీ అయిపోయిన ఈమె.. మరొకవైపు అభిమానులను ఆకట్టుకోవడానికి మీడియాలో బిజీగా మారిపోయింది.

# అక్షయ్ కుమార్ భూత్ బంగ్లా టీజర్ విడుదల




బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్, దర్శకుడు ప్రియదర్శన్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ హారర్-కామెడీ చిత్రం 'భూత్ బంగ్లా'. సుమారు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'భూల్ భులైయా' వంటి క్లాసిక్ సినిమాను గుర్తు చేస్తూ, భయం మరియు నవ్వుల మేళవింపుతో ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మంగళపూర్ అనే గ్రామంలోని 'వధుసురుడు' అనే మిస్టరీ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని టీజర్ ద్వారా చిత్ర బృందం స్పష్టం చేసింది. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్‌తో పాటు టబు, పరేష్ రావల్, రాజ్‌పాల్ యాదవ్, వామిఖ గబ్బి, మిథిలా పాల్కర్ వంటి భారీ తారాగణం నటిస్తుండగా, ప్రీతమ్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న వరల్డ్ వైడ్‌గా విడుదల కాబోతుంది.

# ఉస్తాద్ ప్రచారంలో బిజీగా హరీష్ శంకర్



ప్రస్తుతం హరీశ్ శంకర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 19న భారీస్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. దీనిప్రచారంలో భాగంగా దర్శకుడు వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఆయన మాట్లాడుతూ ఈ సినిమా ప్రీలుక్ పోస్టర్ విడుదలైనప్పుడు వచ్చిన రూమర్స్‌పై స్పందించారు. ప్రీలుక్ పోస్టర్‌లో హీరో వెనక నుంచి తీసిన ఫొటో ఉండటంతో అందులో ఉన్నది పవన్ కల్యాణ్ కాదు, హరీశ్ శంకరే స్వయంగా డూప్‌గా నటించారనే వార్తలు వైరల్ అయ్యాయి. టీజర్ విడుదలైన తర్వాత కూడా కొందరు ప్రేక్షకులు ఆయనే డూప్‌గా నటించారని అన్నారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. తాను పవన్ కల్యాణ్‌కు ఎప్పుడూ డూప్‌గా నటించలేదని స్పష్టం చేశారు. ఆ రూమర్లు చూసి తాను బాధ పడలేదని, పవన్‌తో తనను పోల్చడం, తాను ఒక స్టార్ హీరోలా కనిపిస్తున్నానని జనం అనుకోవడం తనకు సంతోషాన్నిచ్చిందని సరదాగా అన్నారు.చిత్ర పరిశ్రమలో బాడీ డూప్‌ను ఎందుకు ఉపయోగిస్తారనే విషయంపై కూడా హరీశ్ శంకర్ వివరణ ఇచ్చారు. షూటింగ్ సమయంలో హీరోలకు చిన్న గాయం తగిలినా షూటింగ్ షెడ్యూల్స్ మొత్తం అస్తవ్యస్తమవుతాయని, దీనివల్ల నిర్మాతలకు కోట్ల రూపాయల నష్టం వస్తుందని ఆయన తెలిపారు. అందుకే హీరోల భద్రతను దృష్టిలోఉంచుకుని, రిస్క్ ఎక్కువగా ఉండే సన్నివేశాల్లోనే డూప్స్‌ను వాడతారని ఆయన వివరించారు.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com